విద్యార్థుల ఆకలి తీర్చి.. చదువుకు చేయూత!

రాయపర్తి జెడ్పీ పాఠశాలలో ఉచిత అల్పాహార పథకం ప్రారంభం..
హరే రామ కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం ..



సర్పంచ్ గారే సహేంద్ర భిక్షపతి,

రాయవర్తి, నవంబర్ 4 (వుదయం ప్రతినిధి):విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో హరే రామ కృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో రాయపర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత అల్పాహార పథకాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయాన్నే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా చదువుపై ఏకాగ్రత పెంపొందించుకుంటారని భావించి ట్రస్ట్ ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ట్రస్ట్ మేనేజర్ రమేష్, ట్రస్ట్ ప్రతినిధి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గారె సహేంద్ర భిక్షపతి, ఉపసర్పంచ్ మచ్చ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి ఉచిత అల్పాహార పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు.అనంతరం సర్పంచ్ గారె సహేంద్ర భిక్షపతి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించిన హరే రామ కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న ఈ సహకారం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు.అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గారె కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఈ అల్పాహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు హాజరుకావాలని కోరారు.పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు.మండల విద్యాశాఖ అధికారి వెన్నంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల పెంపునకు హరే రామ కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. ఉదయాన్నే పౌష్టికాహారం అందడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం, ఏకాగ్రత పెరిగి విద్యాభ్యాసానికి దోహదపడుతుందని పేర్కొంటూ ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు వీరభద్ర శర్మ, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, ప్రవీణ్ రెడ్డి, రోజారాణి, రాధ, సురేందర్, పీడీ శ్రీనివాస్, నరసింహులు, సంధ్య, దేవేందర్, స్వప్న, విక్రమ్, సీఆర్పీ సంధ్య, జూనియర్ అసిస్టెంట్ వీరస్వామి, కార్యాలయ సిబ్బంది శోభ, అరుణ, పారిశుద్ధ్య కార్మికులు విజయ, ఐలమ్మ తదితరులు, పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తెలంగాణ జన సమితి రాష్ట్ర బృందం.

ప్రజా సమస్యలు, నిరుద్యోగం, రైతుల సమస్యలపై వినతి.
రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్.

తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర నాయకుల బృందం మంగళవారం రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడం, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం, ప్రాణహిత--చేవెళ్ల 22వ ప్యాకేజీ కింద ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తెగిపోయిన చెరువులకు మరమ్మతులు చేసి ఆనకట్టలు నిర్మించడం వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై కూడా ముఖ్యమంత్రితో చర్చించారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్, పి.ఎల్. విశ్వేశ్వరరావు, ధర్మార్జున్, గోపగాని శంకర్రావు, బైరి రమేష్, అధికార ప్రతినిధి సలీం పాషా, నిజ్జన రమేష్, ఆశప్ప, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం. నరసయ్య తదితరులు పాల్గొన్నట్టు వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ వెల్లడించారు.

చంద్రకళ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి.!!

ఆర్. ఎస్. పి. రాష్ట్ర కమిటీ డిమాండ్!!

పర్వతగిరి , నవంబర్ 4 (వుదయం ప్రతినిధి):



తరుణంలో చంద్రకళ హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వల్లందాస్ కుమార్ అన్నారు. గజ్జల హరికృష్ణ వేధింపుల వల్లనే ఆమె మానసిక ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకుందనే ఆరోపణల నేపథ్యంలో ఫోన్ కాల్. రికార్డులు. చాటింగ్ వివరాలు ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలో గకుండా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . చంద్రకళ కుటుంబానికి 50 లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో కందికట్ల శ్రీనివాసు .పసుల కుమారస్వామి. తదితరులు పాల్గొన్నారు

శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. ద్వితీయ సంవత్సరం. చదువుతున్న డాకూరి చంద్రకళ. ఆత్మహత్య సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని. రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ. రాష్ట్ర కమిటీ సభ్యులు. వరంగల్ జిల్లా కార్యదర్శి. వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి దారి తీసిన పరిస్థితులను. వెలికితీయడంతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న గజ్జల హరికృష్ణ. పై చట్టం ప్రకారం నాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. షాద్ నగర్ కు చెందిన వ్యవసాయ కూలి కుటుంబంలో జన్మించిన చంద్రకళ. కష్టాలను అధిగమించి ఉన్నత విద్య అభ్యసిస్తూ. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న

ఆరోగ్య కేంద్రాల్లో అంకితభావంతో సేవలు అందించాలి

హెచ్‌పివి, రొటీన్ టీకాలను వేగవంతం చేయాలి
--- డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య
పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ..
విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



హనుమకొండ, నవంబర్ 04 (వుదయం జిల్లా ప్రతినిధి) :

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య సూచించారు. బుధవారం జిల్లాలోని వంగర, ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (గ్రానజ) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

?ఈ సందర్భంగా ఫార్మసీలోని మందుల నిల్వలు, ల్యాబొరేటరీ రికార్డులు, హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. మాతా శిశు ఆరోగ్య సేవలు, సాధారణ టీకాల కార్యక్రమం, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను మరింత వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలు సాధించాలన్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కింద ప్రజలకు విస్తృతంగా స్క్రీనింగ్ చేసి, వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్సతో పాటు ఫాలోఅప్ చేయాలని స్పష్టం చేశారు. 'టీబీ ముక్త్ భారత్'లో భాగంగా క్షయ బాధితులను ముందస్తుగా గుర్తించి ఉచిత వైద్యం అందించాలన్నారు.

కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం క్రమం తప్పకుండా 'డ్రై డే' పాటించాలని, పారిశుద్ధ్య చర్యలతో పాటు యాంటీ లార్వా ఆపరేషన్లు సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు.

?ఈ తనిఖీ కార్యక్రమంలో వంగర వైద్యాధికారులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రూబీనా, ముల్కనూర్ వైద్యాధికారి డాక్టర్ ముజీబ్ ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల ఆర్ సర్వే!

భూముల రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ఆత్మకూరు, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు.సర్వే సమయం లో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి,కామారం సర్పంచ్ తోట లక్ష్మీ, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.



హలో మాదిగ చలో భూపాలపల్లి.

భూపాలపల్లి నవంబర్ 4 వుదయం ప్రతినిధి.

ఈనెల6 భూపాలపల్లి లో ఎంఆర్పిఎస్ ఎంఎస్ఎఫ్ ఎంఎస్పి జిల్లా కమిటీ సమావేశం జరుగుతున్నందున టేకుమట్ల మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం ఎస్ ఎఫ్ నాయకులు.. మండలంలోఉన్నటువంటి మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్.. రామ చందర్ మాదిగ మరియు టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ అన్నారు వారు మాట్లాడుతూ మాదిగలు చైతన్యవంతులై ఎవరి అండదండలు లేకుండా స్వతంత్రంగా రాజకీయాల వైపు అడుగులు వేస్తున్నారని అది మన జాతిని విముక్తి పరిచే దిశగా రాజకీయ చైతన్యానికి నాంది అని వారు పేర్కొన్నారు ఎమ్మార్పీఎస్ పోరాటం దశలవారీగా ముందుకు సాగుతున్న వేళ మాదిగ విద్యార్థులు ప్రేక్షకుల్లా కాకుండా పోరాటాలకు ముందు నడవాలని వారు పిలుపునిచ్చారు భవిష్యత్ తరాల బ్రతుకులు మార్చే ఈ ప్రయాణంలో మాదిగ విద్యార్థులే ప్రధాన పాత్ర పోషించాలన్నారు చదువు మనకు జ్ఞానాన్ని ఇస్తే చైతన్యం మనకు దిశను చూపిస్తుంది పోరాటం మనకు విముక్తిని అందిస్తుందని దినికి టేకుమట్ల మండలంలో ఉన్నటువంటి విద్యార్థులు ఎంఆర్పిఎస్ నాయకులు ఎంఎస్పి నాయకులు పాల్గొని జిల్లా కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.

సాధారణ ప్రసవాలనే ప్రోత్సహించాలి!

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి
నవజాత శిశువులకు 24 గంటల్లోపు హెపటైటిస్-బి టీకా అందించాలి
సీకేఎం ఆసుపత్రిలో అదనపు కలెక్టర్‌తో కలిసి సేవల సమీక్ష
మాతా శిశు ఆరోగ్య సంరక్షణకే తొలి ప్రాధాన్యం: డీఎంహెచ్ఓ



వరంగల్ (నవంబర్ 4):ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స (సి-సెక్షన్) ప్రసవాల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాలను పెంచేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి. రాజా రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌తో కలిసి వరంగల్ సీకేఎం ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించి, ఆర్ఎంఓలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

?ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ రాజా రెడ్డి మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితి ఉంటేనే సిజేరియన్లు చేయాలని, సాధారణ ప్రసవాల ప్రాధాన్యంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. హెపటైటిస్-బి పాజిటివ్ ఉన్న తల్లులకు జన్మించిన పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకకుండా పుట్టిన 24 గంటల్లోపే హెపటైటిస్-బి వ్యాక్సిన్‌తో పాటు హెపటైటిస్-బి ఇమ్యూనోగ్లోబులిన్ తప్పనిసరిగా వేయాలని స్పష్టం చేశారు.

?అంతకుముందు, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్‌తో సమన్వయం చేసుకొని 'స్టెమీ' కార్యక్రమ అమలు, పాలియేటివ్ కేర్ సేవల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. సీకేఎం ఆసుపత్రి పరిధిలోని యూఐఫ్‌డబ్ల్యూసీ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, ఓపెన్ వైల్ పాలసీని సక్రమంగా అమలు చేయాలని, కోల్డ్ చైన్ నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

పెండ్యాల విజయలక్ష్మి దశదిన కర్మ లో కుటుంబ సభ్యుల ను పరామర్శించి ఓదార్చిన..

భాధితుల కుటుంబ సభ్యులకు 5,016/-ఆర్థిక సహాయం అందచేత
- రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు



పర్వతగిరి నవంబర్ 04 (వుదయం ప్రతినిధి):తీవ్ర విషాదంలో మునిగిపోయిన కుటుంబాలకు కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా.. ఒక పెద్ద దిక్కుగా నిలబడి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అండగా భరోసానిచ్చారు కష్టసుఖాల్లోపాలుపంచుకోవడమే నిజమైన ప్రజా నాయకుడి లక్షణమని ఆయన మరోసారి నిరూపించారు.వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం ఏనుగల్ గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన పెండ్యాల విజయలక్ష్మి ఇళ్లలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ వార్త తెలుసుకున్న రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ,ఏఎంసీ మాజీ మార్కెట్ డైరెక్టర్ యుగంధర్ రావు నేరుగా ఆయా కుటుంబాల ఇళ్లకు వెళ్లారు.కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యుల ఓదార్పు.. ప్రియమైన వారిని కోల్పోయి శోకసంద్రంలో ఉన్న మృతుల కుటుంబ సభ్యులను వారు పేరుపేరునాపరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ పెద్దలను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబాలకు ధైర్యం చెబుతూ.. వేమున్నామంటూ గుండెలకు హత్తుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాల వర్తిని చూసి చలించిన నాయకులు, తమ వంతుగా కొంత ఆర్థిక సహాయం రు. 5,016/- అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆవదలో ఉన్నవారికిఆపద్బాంధవులా నిలిచిన నాయకుల తీరును గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కర్నె రవీందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తొర్రి లక్ష్మణ్ యాదవ్, పెండ్యాల సత్యనారాయణ, రవీందర్, రాజు, రామ్, రామగుని రాజు, కాగితాల రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతికి పరకాల డిపోలో నివాళులు
.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి.



పరకాల నవంబర్ 4 (వుదయం ప్రతినిధి): మణుగూరు డిపోకు చెందిన ఉద్యోగిని ప్రవళిక అకాల మరణం పట్ల పరకాల ఆర్టీసీ డిపోలో సంతాప సభ నిర్వహించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ బుధవారం పరకాల డిపో గేటు ఎదుట అన్ని యూనియన్ల నాయకులు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని, బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఇలాంటి విషాదకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల్లో కూడా చైతన్యం రావాలని సూచించారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, ఈ.ఆర్. ప్రసాద్, మంద శ్రీనివాస్, బి.డి. స్వామి, ఎస్ఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆహా శ్రీను, డిపో అధ్యక్షుడు రఘువీర్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నాయకులు, వివిధ యూనియన్ల నాయకులు, మహిళా కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో 'స్నేహం' నెరవేర్చిన బాధ్యత

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ చైర్మన్ చేతుల మీదుగా సాయం
స్నేహానికి సార్థకత, అకాల మరణం చెందిన మిత్రుడి కుటుంబానికి రూ.57 వేల ఆర్థిక సాయం



వరంగల్ సిటీ, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని వరంగల్‌కు చెందిన కొందరు మిత్రులు నిరూపించారు. వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మూశం సారంగపాణి ఇటీవల అకాల మరణం చెందడంతో, ఆయన బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు చిన్ననాటి మిత్రులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు.

?సారంగపాణి చిన్ననాటి మిత్రులందరూ కలిసి సేకరించిన రూ.57,000 ఆర్థిక సహాయాన్ని బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

?ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు మాట్లాడుతూ... అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి చిన్ననాటి మిత్రులు చూపిన మానవతా దృక్పథం ఎంతో అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు మనకు చేతనైన సాయం అందించడమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో లయన్ పోషల సురేందర్, దండు దయాసాగర్, రామ రమేష్, మహేందర్, యుగేందర్, వెంకన్న, కృష్ణ, జగన్, గోరంటల మనోహర్, మంతెన అమ్రేష్‌లతో పాటు ఇతర చిన్ననాటి మిత్రులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు, సర్పంచులతో అదనపు కలెక్టర్ రవి సమావేశం



ఎల్కతుర్తి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాల మేరకు ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో దండేపల్లి, గుంటూరు పల్లి గ్రామాల రైతులు, సర్పంచులతో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సమావేశమయ్యారు. దండేపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో స్టాక్ నిల్వల నిర్వహణ కోసం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీసీఎల్ కంపెనీ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, అలాగే రైతుల అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను రైతులు అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, నాయబ్ తహసిల్దార్ రమేష్, దండేపల్లి, గుంటూరుపల్లి గ్రామాల సర్పంచులు , ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మునగ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశం

- మునగ పంట కొనుగోలుకు సంస్థల ఆసక్తి
- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులను దృష్టిలో ఉంచుకుని, రైతులు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో 15 ఎకరాల విస్తీర్ణంలో మునగ సాగు చేస్తున్న రైతు మహేందర్ రావు తోటను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి మునగ సాగు విధానం, పెట్టుబడి వ్యయం, పంట దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు మహేందర్ రావు మాట్లాడుతూ, ఒక ఎకరా మునగ సాగులో మొదటి సంవత్సరం 600 కిలోలు, రెండవ సంవత్సరం 2,000 కిలోలు, మూడవ సంవత్సరం 4,000 కిలోల చొప్పున మొత్తం మూడు సంవత్సరాల్లో 6,600 కిలోల ఎండిన మునగ ఆకుల దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో ఎండిన మునగ ఆకుల ధర సుమారు రూ.100 ఉందని, తద్వారా మూడు సంవత్సరాల్లో ఎకరాకు రూ.6.60 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. వరి సాగుతో పోలిస్తే మునగ సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. మునగ పంటకు కొనుగోలు హామీ (బైబ్యాక్ గ్యారంటీ) కల్పించాలని రైతు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అక్కడికక్కడే టాటా, యూనికార్న్, బొటానికా సంస్థల ప్రతినిధులతో ఫోన్ ద్వారా మాట్లాడి మునగ పంట కొనుగోలు అవకాశాలపై చర్చించారు. దీనికి సానుకూలంగా స్పందించిన సంస్థల ప్రతినిధులు మునగ పంట కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తరపున VB-G RAM G పథకం కింద మునగ సాగు చేపట్టే రైతులకు గుంతలు తవ్వించడం, మునగ మొక్కలు సరఫరా చేయడం వంటి అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని ప్రభుత్వ సబ్సిడీ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి వంటి సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని, తక్కువ నీటి వినియోగం, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రమణా రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు), పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది రోగులు ఓపీ సేవల కోసం వస్తున్నారని ఆరా తీశారు, ఓపీకి వచ్చిన రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా, వారందరికీ అభా (ABHA) రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారా అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో గత నెలలో ఎంతమంది గర్భిణులకు ప్రసవ తేదీలు (EDD) ఉన్నాయని, వారిలో ఎంతమందికి ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు నిర్వహించారని కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ, సాధారణ ప్రసవాలు నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, నిరంతర పర్యవేక్షణ అందిస్తూ, సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలు, బాలింతలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వస్తున్నారా, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందని , వైద్యులు సూచించిన మందులు తీసుకుంటున్నారా అనే వివరాలను తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఐరన్‌తో పాటు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా చిన్నపిల్లలకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని రకాల టీకాలు వేయిస్తున్నారా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి వారి ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతిపై పొన్నం ఆవేదన

ఆర్టీసీ కుటుంబంలో తీరని విషాదం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి, కుటుంబానికి ఆర్టీసీతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా పరిహారం కూడా కుటుంబానికి అందనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం స్పందించి ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుందని, అయినప్పటికీ ప్రవళికను కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా ప్రయాణికుల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. అయితే ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడకూడదని, ఇలాంటి ఘటనల వల్ల ఒక కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రయాణికులను దేవుళ్లుగా భావించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రయాణికులకు, సిబ్బందికి మధ్య ఏవైనా సమస్యలు తలెత్తితే చట్టపరమైన మార్గాల్లో ఫిర్యాదు చేసుకోవాలని, దాడులకు పాల్పడటం సరికాదని స్పష్టం చేశారు.



ముగిసిన ఉర్సు ఉచ్చవాలు

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

భువనగిరి పట్టణం లోని స్థానిక చెరువు కట్ట వద్ద గల హజరత్ రాజా బాగ్ సవార్ AL మార్రూఫ్ ఉజలే షా ఉర్సు ఉచ్చవాలు ఎండీ జియా గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ముఖ్య అతిగా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ గారు పాల్గున్నారు ఈ సందర్బంగా గంద సమర్పించారు మరియు ప్రత్యేక ప్రధాన నిర్వహించడం జరిగింది అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం వార్డ్ కౌన్సిలర్ ఎండీ బురహన్ బెండ లాల్ రాజ్ తహరా బబ్లు గారు . మహమ్మద్ షాబుద్దీన్ అలిహజ్ మొహమ్మద్ అలీముద్దీన్ ఎండీ .సిరాజుద్దీన్ఎండీ .శంషాద్దీన్ అల్లాద్దీన్ ఎండీ .జియాద్దీన్ హుస్సేముద్దీన్ శిజాద్దీన్ రఫియాద్దీన్ కామలుద్దీన్ షర్ఫుద్దీన జహీరుద్దీన్ జరీఫ్ రిజవాన్ ఎండీ అమీర్ ఎండీ అనసూయ .షూబ్ ఎండీ షేరజ్ తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చినా.. వరదొచ్చినా.. ప్రజల వెంటే ఆదర్శ కౌన్సిలర్!

- తుఫానులోనూ ప్రజాసేవే లక్ష్యం.. ప్రజలకు అండగా నిలిచిన కౌన్సిలర్!
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతుల ఆదేశాలు.. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రత్యేక చొరవ
- జేసీబీతో వరద నీటి మళ్లింపు పనులు.. రంగంలోకి దిగిన 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు



కల్లూరు,నవంబర్ 4 (వుదయం ప్రతినిధి)

భారీ వర్షాలు కురుస్తున్నా.. వరద ముప్పు పొంచి ఉన్నా.. ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు ముందుకు సాగుతున్నారు. అంబేడ్కర్ నగర్‌లో భారీ వర్షాల కారణంగా వరద నీరు నిలిచిపోయి కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడటంతో ఆయన వెంటనే స్పందించారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతుల ఆదేశాలు, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రత్యేక చొరవతో వరద నీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. కాలనీలోకి వరద నీరు చేరకుండా జేసీబీని తక్షణమే ఏర్పాటు చేసి, యుద్ధ ప్రాతిపదికన నీటిని మళ్లించాలని చైర్మన్ మోహన్ నాయక్ సూచించారు. దీంతో కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు స్వయంగా రంగంలోకి దిగి జేసీబీతో వరద నీటి మళ్లింపు పనులను పర్యవేక్షించారు. ఈ చర్యలతో కాలనీవాసులకు తక్షణ ఉపశమనం కల్పించే ప్రయత్నం చేశారు.

వర్షాకాలంలోనూ నిరంతర పర్యవేక్షణ!

వర్షాలు కురిసిన ప్రతిసారీ లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపడుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తూ అందుబాటులో ఉంటున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ముందస్తు జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

గత చేదు అనుభవాలు.. మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు!

గతంలో అంబేద్కర్ నగర్‌లో డెంగ్యూ జ్వరాల విజృంభణతో 18 మంది మృత్యువాత పడిన విషాదకర ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో అప్పటి జిల్లా కలెక్టర్ కర్ణన్ సైతం కాలనీని సందర్శించారు. అలాంటి దుర్భర పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

సమస్య వచ్చిన తర్వాత కాదు.. రాకముందే అప్రమత్తం కావడమే ప్రజాసేవ!

ప్రజా సమస్యలపై తక్షణ స్పందన, అవసరమైన సమయంలో యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం, ప్రజలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలతో ఉబ్బన రాంబాబు తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే దంపతుల మార్గదర్శకత్వం, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ చొరవతో చేపట్టిన వరద నీటి మళ్లింపు చర్యలపై అంబేద్కర్ నగర్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్న కౌన్సిలర్ సేవా దృక్పథంపై కల్లూరు పట్టణ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

అవినీతి తిమింగలం సస్పెన్షన్ : ముదిరాజ్ సమాజంలో వెల్లువలాంటి హర్షం!

- నకిలీ జీవోలు, బోగస్ సభ్యత్వాల దందాకు అడ్డుకట్ట వేసిన ప్రభుత్వం..
- పేద మత్స్యకారుల పొట్టకొట్టిన అవినీతి అధికారిపై ముదిరాజ్ సంఘం తీవ్ర ఆగ్రహం..
- త్వరగా చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు..

ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్ 4 :



మత్స్యశాఖలో సుదీర్ఘకాలంగా తిష్టవేసి, అధికార బలంతో పేద మత్స్యకారుల రక్తాన్ని పిండిన అవినీతి అధికారి ఆంజనేయ స్వామి పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడం పట్ల రాష్ట్ర, జిల్లా ముదిరాజ్ సంఘం తీవ్ర హర్షం వ్యక్తం చేసింది.. అవినీతి అధికారి సస్పెండ్ అయిన వార్త తెలియగానే రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ముదిరాజ్ కుల పెద్దలు, సంఘం ప్రతినిధులు ఒకేతాటిపై కూర్చొని అవినీతి అధికారి అక్రమాల సామ్రాజ్యాన్ని ఎండగట్టారు..

లంచాల పిశాచి.. నకిలీల సూత్రధారి..

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ... సస్పెండ్ అయిన అధికారి ఒక లంచాల పిశాచిలా ప్రవర్తించాడని మండిపడ్డారు.. కేవలం కోమట్లగూడెం సొసైటీకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా వందలాది నకిలీ సభ్యత్వాలను సృష్టించి సాంప్రదాయక వృత్తి నైపుణ్యం లేని అనర్హులకు చెరువులను కట్టబెట్టాడని ధ్వజమెత్తారు.. ఏకంగా ప్రభుత్వ ఉన్నత ఉత్తర్వులను (జీఓస్) సైతం ఫోర్జరీ చేసి, బోగస్ ప్రొసీడింగ్స్ తయారు చేసిన ఇలాంటి ఘోరమైన అవినీతి అధికారి వల్ల ఎంతోమంది నిజమైన ముదిరాజ్ బిడ్డలు ఆకలితో అలమటించారని, సొసైటీల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకున్నాడని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు పాపం పండి ఈ అవినీతి తిమింగలం ఇంటికి చేరిందని వారు ఎద్దేవా చేశారు.

ప్రభుత్వానికి జేజేలు.. శ్రమజీవుల పక్షపాతి ఈ ప్రభుత్వం

పేద మత్స్యకారుల ఆవేదనను, తాము అందించిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే స్పందించిన ప్రభుత్వంపై ముదిరాజ్ కులస్థులు ప్రశంసల వర్షం కురిపించారు.. అక్రమార్కుడిని ఉపేక్షించకుండా, సస్పెన్షన్ వేటు వేసి ప్రభుత్వం తన నిజాయితీని, ప్రజాపక్షపాత వైఖరిని చాటుకుందని కొనియాడారు.. "శ్రమ నమ్ముకున్న ముదిరాజ్ బిడ్డలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ నిర్ణయంతో రుజువైంది" అని హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి సాహసోపేతమైన, న్యాయమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి, మత్స్యశాఖ మంత్రి ఖమ్మం ఇన్చార్జి వాకటి శ్రీహరి కి, ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విచారణను వేగవంతం చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులకు, (కమిషనర్ కి) ముదిరాజ్ సమాజం తరపున శిరస్సు వంచి హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు..

బోగస్ సభ్యత్వాలు పూర్తిగా రద్దు చేయాలి..

సస్పెన్షన్ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, అవినీతి అధికారి జిల్లా అంతటా సృష్టించిన అన్ని నకిలీ జీవోలను, బోగస్ సభ్యత్వాలను తక్షణమే రద్దు చేసి స్క్రీనింగ్ కమిటీ ద్వారా నిజమైన మత్స్యకారులకే చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేసినందుకు అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ ఆస్తులను జప్తు చేయాలని కోరారు. పేదల పొట్టకొట్టే అధికారులకు ఈ సస్పెన్షన్ ఒక బలమైన హెచ్చరిక కావాలని ముదిరాజ్ సంఘం స్పష్టం చేసింది. ఈ విలేకరుల సమావేశంలో మన ముదిరాజు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర వెంకట నరసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్రతానపు వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పెర జానకి రాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొమ్ము భాస్కర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు, మత్స్యశాఖ కన్వీనర్ బొమ్మకంటి సైదులు ముదిరాజ్, ఉపాధ్యక్షులు చింతనబోయిన సీతారాములు ముదిరాజ్, దంతాల కేశవులు ముదిరాజ్, గొడుగు నాగేశ్వరరావు ముదిరాజ్, బండారి శ్రీను ముదిరాజ్, కోశాధికారి ఓర వెంకటేశ్వర్లు ముదిరాజ్, కార్యదర్శులు పందుల ఉపేందర్ ముదిరాజ్, చామకూరి నాగేశ్వరరావు ముదిరాజ్, గోగుల శ్రీను ముదిరాజ్, నర్ల శేషయ్య ముదిరాజ్, కోమట్లగూడెం మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు బుడిగె వెంకటేశ్వర్లు ముదిరాజ్, అడపా ప్రవీణ్ ముదిరాజ్, వివిధ మండలాల ప్రతినిధులు, బాధిత మత్స్యకార సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ డబ్ల్యూ సి గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

హమాలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తామని హామీ

సూర్యాపేట జిల్లా, నవంబర్ 04: వుదయం ప్రతినిధి

గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్ డబ్ల్యూ సి గోదాంను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ ఐ ఎఫ్ ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



హమాలీలకు లేబర్ కార్డులు

అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్, ఎస్ డబ్ల్యూ సి మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

తేజావత్ నరసింహారావు దిగ్భ్రాంతి

నల్గొండ జిల్లా నవంబర్ 04 వుదయం ప్రతినిధి



ఖమ్మం జిల్లాలో టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపోలో మహిళా కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక మృతి పట్ల ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తేజావత్ నరసింహారావు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవళిక మృతి అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించి ఆదుకోవాలని ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయం పట్ల టీడీపీ శ్రేణుల హర్షం

మధిర,నవంబర్,4, వుదయం, ప్రతినిధి:



ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక,నగరపాలక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల సుపరిపాలన, బహుముఖ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ పథకాల అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమికి పట్టం కట్టారని పేర్కొన్నారు. ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేయడంతో పాటు ఎన్నికల సమయంలో కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, అయినప్పటికీ చంద్రబాబు సూచనల మేరకు టీడీపీ శ్రేణులు సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా ఎన్నికల్లో పనిచేశాయని తెలిపారు. జగన్, వైసీపీ అనైతిక రాజకీయాలను ప్రజలు తిరస్కరించి కూటమికి ఘన విజయాన్ని అందించారని పేర్కొంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ,పవన్ కళ్యాణ్‌లకు అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్ బాబు మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య అభ్యర్థుల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలతో పాటు వైసీపీ సృష్టించిన అడ్డంకులను ఎదుర్కొంటూ చంద్రబాబు ఎన్నికల్లో సమర్థవంతంగా పోరాడారని అన్నారు.ఓటు వేయకుండా బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన జగన్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు మాట్లాడుతూ ఏకగ్రీవాలు జరిగిన చోట ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనని గతంలో ప్రకటించిన జగన్ ఆ మాటకు కట్టుబడి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, పట్టణ టీడీపీ కార్యదర్శి సట్టు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ బోడేపూడి రేవతి, సీనియర్ నాయకులు చెరుకూరి కృష్ణారావు, వేల్పులకొండ, చెన్నం స్వామి, మహిళా నాయకురాలు మేడిపల్లి రాణి, పాశం రామనాథం, వాసిరెడ్డి ప్రకాశ రావు, మేడా వెంకటేశ్వరరావు, వంగాల రామకోటి, పోతినేని కోటేశ్వరరావు,గద్దం మల్లికార్జునరావు, కేశవపట్నం రామయ్య, తిరపతి కృష్ణమూర్తి, అనుమోలు సతీష్, బోడేపూడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఈశ్వర్, చటారి ముసిలి, గద్దల నరసింహారావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది

సూర్యాపేట నవంబర్ 04, వుదయం ప్రతినిధి



సూర్యాపేట మున్సిపాలిటీకి రెండు విడతల్లో 1000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలోని 45వ వార్డు విద్యానగర్ లో 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో రెండు విడతల్లో 1000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇందుకు సహకరించిన జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు. 45వ వార్డులో రోడ్డు సమస్య ఉందని తనకు అక్కడి ప్రజలు ఫోన్ చేయగానే వెంటనే రోడ్డు రిపేర్ చేయించడం జరిగిందని ఆమె అన్నారు. సూర్యాపేట పట్టణంలో దాదాపు 3500 మంది పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన అందరికీ పెన్షన్లు ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణానికి 1000 ఇందిరమ్మ ఇళ్లను తీసుకొచ్చిన మున్సిపల్ చైర్ పర్సన్ కు అభినందనలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని, పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారు అన్నారు. 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు. తమ వార్డులో ఏ సమస్య ఉన్నా చెప్పగానే వెంటనే పరిష్కారం చేస్తున్నారని తమకు సహకరిస్తున్న చైర్ పర్సన్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, నాయకులు సవరాల సత్యనారాయణ, నరేంద్రుని హరీష్, వెంపటి మనోహర్, మున్సిపల్ డీఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, జవాను కొండేటి వెంకన్న, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

మెట్ట, గుట్టల ప్రాంత భూములకు మాగాణి గా ముద్ర..

- గీత కార్మికుల పింఛన్లకు గండం! అర్హతల పై గందరగోళం!
- పేద గీత కార్మికుల పింఛన్లతో చెలగాటమా?
- మెట్ట భూములను మాగాణిగా చూపిస్తూ అనర్హత వేటు? అధికారుల తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం!

చిలుకూరు, నవంబర్ 04:(వుదయం)



మండలంలో కల్లుగీత కార్మికుల పింఛన్ల అర్హత విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఐదు ఎకరాల వరకు మెట్ట భూమి కలిగిన వారికి సంబంధించిన అర్హతలపై వివాదం తలెత్తుతోంది. ముఖ్యంగా వాస్తవానికి మెట్ట భూములుగా ఉన్న పొలాలను రెవెన్యూ రికార్డుల్లో మాగాణి భూములుగా చూపిస్తూ గీత కార్మికులను పింఛన్లకు అనర్హులుగా ప్రకటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా సంప్రదాయ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతామనే ఆందోళనలో ఉన్నారు. చిన్నచిన్న కమతాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న పేద కార్మికులకు పింఛనే పెద్ద ఆర్థిక భరోసాగా ఉంటుందని, అలాంటి పింఛన్ల విషయంలో భూముల వర్గీకరణను తప్పుగా చూపించడం తమకు అన్యాయం చేయడమేనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి రికార్డుల్లో ఉన్న వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు ఒకేలా ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాలని కోరుతున్నారు. అవసరమైతే రెవెన్యూ, సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి భూముల స్వభావాన్ని నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పుడు వర్గీకరణ కారణంగా ఒక్క అర్హుడికి కూడా పింఛన్ నిలిపివేయకూడదని, ఇప్పటికే అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులను పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి చిలుకూరు మండల గీత కార్మికులకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


గీత కార్మికుల పింఛన్ అర్హతలు ఇవే.. తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ప్రభుత్వ చేయూత పింఛన్ పొందేందుకు సాధారణంగా కనీసం 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. గీత కార్మికుల సహకార సంఘంలో సభ్యత్వం, తెలంగాణ నివాస ధ్రువీకరణ, ప్రభుత్వం నిర్ణయించిన ఆదాయ పరిమితులకు లోబడి ఉండటం వంటి అర్హతలు అవసరం. భూముల విషయానికి వస్తే మాగాణి భూమి 3 ఎకరాలకు మించి, మెట్ట భూమి 7.5 ఎకరాలకు మించి ఉంటే అనర్హత నిబంధనలు వర్తించే అవకాశం ఉంది. అయితే భూముల వాస్తవ స్వభావాన్ని పరిశీలించకుండా మెట్ట భూములను మాగాణి భూములుగా చూపించడం వల్ల అర్హులైన గీత కార్మికులకు అన్యాయం జరగకూడదు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వయస్సు ధ్రువీకరణ, బ్యాంకు పాస్‌బుక్, గీత కార్మిక సంఘం సభ్యత్వ ధ్రువీకరణ, భూమి రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది. చిలుకూరు మండలంలో భూముల వర్గీకరణపై నెలకొన్న అనుమానాలను రెవెన్యూ, సంక్షేమ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన గీత కార్మికులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు

లేనిపక్షంలో ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌ను కలిసి అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు గీత కార్మికులు సిద్ధమవుతున్నారు.

మల్లెపూల వాగులో చిక్కుకున్న మహిళను కాపాడిన రెస్క్యూ టీం

మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో మాట్లాడిన మంత్రి

దమ్మపేట నవంబర్ 4 (వుదయం ప్రతినిధి):




దమ్మపేట మండల పరిధిలోని దురదపాడు గ్రామంలో మల్లెపూల వాగులో చిక్కుకున్న మహిళను రెస్క్యూ టీం కాపాడింది. ఆ గ్రామానికి చెందిన వీర ప్రోలు నాగమణి పొలం పనులు కోసం వెళ్లగా ఆకస్మికంగా వచ్చిన మల్లెపూల వాగు వరదలో చిక్కుకుంది. వెంటనే ఆ గ్రామస్తులు మంత్రి తుమ్మలకు తెలియజేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల చరవాణి ద్వారా మాట్లాడి రెస్క్యూటీం ను ఏర్పాటు చేయవలసినదిగా ఆదేశించారు. తుమ్మల ఆదేశాలతో దురదపాడుకు చేరుకున్న రెస్క్యూ టీం ఆమెను కాపాడింది. నాగమణి క్షేమంగా ఇంటికి రావడంతో దురదపాడు గ్రామస్తులు నాగమణి బంధువులు మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

మురసు తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్

దమ్మపేట నవంబర్ 4 (వుదయం ప్రతినిధి):



దమ్మపేట మండలంలో మురసు తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని ప్రకటించాలని బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కురిసిన భారీ వర్షాల వలన వరి,మొక్కజొన్న,అరటి,శెనగ తదితర పంటలు దెబ్బతిన్నయని అన్నారు.మండలంలో జరిగిన పంటనష్టాన్ని అధికారులు వెంటనే సర్వే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అనేక ప్రాంతాల్లో పంటలు దెబ్బతినటమే కాకుండా గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న పూరిండ్లకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, గ్రామాలలో అంటువ్యాధులు ప్రభలకుండా తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని,నీట మునిగిన కాలనీలు,విధుల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అన్నారు.రోడ్ల మీద పొంగి పొర్లుతున్న ప్రాంతంలో ప్రత్యమ న్యాయ రోడ్ మార్గాలను ఏర్పాటు చేసి, తెగిన చెరువులను, కుంటలను,రోడ్లను వర్షం, వరద తగ్గిన వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేసారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- బియ్యం ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్

ఖమ్మం జిల్లా నవంబర్ 04 వుదయం ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కృత్రిమ కొరత సృష్టించినా ..

నిత్యావసర వస్తువుల చట్టం (Essential Commodities Act) ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప ప్రథమ వర్ధంతిలో పాల్గొని నివాళులర్పించిన పట్టణ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 04 వుదయం ప్రతినిధి



నల్లగొండ పట్టణ కేంద్రంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీమతి దుబ్బ రూప ప్రథమ వర్ధంతి జ్ఞాపకార్థం సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం నల్లగొండ పట్టణంలోని బండారు గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దుబ్బ రూపతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె సేవలను స్మరించుకున్నారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా పార్టీ అభివృద్ధికి, మహిళల సంక్షేమానికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాను బాధిత రైతులకు ఎకరాకు రూ. 40,000 నష్టం పరిహారం చెల్లించాలి

బీజేపీ మండల అధ్యక్షులు పారెల్లి మహేష్

చిలుకూరు నవంబర్ 04:(వుదయం)



ఇటీవల సంభవించిన మురసు తుఫాను వల్ల తీవ్రంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ చిల్కూరు మండల అధ్యక్షులు పారెల్లి మహేష్ డిమాండ్ చేశారు. మండలంలో దెబ్బతిన్న, నేలకొరిగిన పంటలను బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. పెట్టుబడులు కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

ముఖ్య డిమాండ్లు:

పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 40,000 చొప్పున తక్షణ నష్టపరిహారం చెల్లించాలి. మంత్రి పర్యటన: జిల్లా మంత్రి మరియు ఉన్నతాధికారులు తక్షణమే మండలంలో పర్యటించి, పడిపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను తక్షణమే వర్తింపజేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ బీమా క్లెయిమ్ అందేలా చూడాలి. అధికారులు రాజకీయాలకు అతీతంగా పారదర్శక సర్వే జరిపి, అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పారెల్లి మహేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు కొండా శీను,నరసింహా వర్మ, మండల ఉపాధ్యక్షులు తిపరిశెట్టి బసవయ్య, బోడ అనిల్ కుమార్, బాదే మల్లికార్జున్, గణపరపు నాగరాజు స్థానిక బీజేపీ నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం.. అప్రమత్తమైన యంత్రాంగం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. చుంచుపల్లి మండల ఎంపీడీవో సుభాషిని, తహసీల్దార్ నాగరాజు పెనగడప గ్రామపంచాయతీ పరిధిలోని ములుగూడెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సమీపంలోని వాగు భారీ వర్షాలకు ఉద్ధృతంగా ప్రవహిస్తూ వరద నీరు రోడ్డుపై నుంచి పొంగిపొర్లుతున్న పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు పెనగడప గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రామకృష్ణ వరద ప్రభావిత ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రజలు వాగులు దాటి ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తం చేస్తూ, వరద ప్రవాహం దాటేందుకు ఎవరూ ప్రయత్నించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే సమయంలో వాటిని దాటేందుకు ఏమాత్రం ప్రయత్నించవద్దని అధికారులు సూచించారు.

నల్లగొండ డీసీసీబీ 105వ మహాజనసభ సమావేశం

బ్యాంకు వార్షిక నివేదిక, ఆడిట్ నివేదికలకు ఆమోదం

నల్లగొండ, జిల్లా నవంబర్ 04 వుదయం ప్రతినిధి




నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో బుధవారం 105వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నల్లగొండ జిల్లా డీసీఓ, అఫీషియల్ పీఐసీ కమిటీ సభ్యురాలు, ఎన్డీసీసీబీ అధ్యక్షురాలు శ్రీమతి టి. మమత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గత మహాజనసభలో తీసుకున్న తీర్మానాలను సమావేశంలో ధ్రువీకరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు పరిపాలనా వార్షిక నివేదికతో పాటు స్టాట్యూటరీ ఆడిట్ నివేదిక, ఆడిటర్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, జమా ఖర్చులు, లాభనష్టాల వివరాలను సభ ఆమోదించింది. అనంతరం వివిధ సహకార సంఘాల చైర్మన్లు పంట రుణాల పంపిణీ, రుణాల వసూళ్లు, డివిడెండ్ చెల్లింపులకు సంబంధించిన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధ్యక్షురాలు టి. మమత సానుకూలంగా స్పందిస్తూ, సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీసీఓ కె. నాగార్జున, నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, బ్యాంకు జేఆర్ఓ ఎస్డీ మైకేల్ బోసు, బ్యాంకు సీఈఓ ఆర్. శంకర్ రావు, జీఎం శ్రీమతి నర్మద, పలువురు బ్యాంకు అధికారులు, వివిధ సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ మృతి బాధాకరం

కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల, నవంబర్ 4 (వుదయం):



మునగాల మండల పరిధిలోని బరకత్‌గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం బరకత్‌గూడెం గ్రామానికి చేరుకున్న ఆయన ఏనుగుల సత్యనారాయణ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏనుగుల సత్యనారాయణ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునగాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, కోలా ఉపేందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు నిమ్స్ లో మెరుగైన వైద్యం కోసం రూ. 2లక్షల ఎల్వోసీ అందజేత

ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్ 4



రఘునాథపాలెం మండలం గణేశ్వరంకు వాస్తవ్యులు అజ్మీరా చిన్న ప్రసాద్ కూతురు లాస్యశ్రీ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ప్రసాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను కలిసి తన కూతురు ఆరోగ్య పరిస్థితిని గురించి వివరించారు.ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి నిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం కోసం సీఎం ఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేయించారు.ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ)ను ఎంపీ వద్దిరాజు బుధవారం ఖమ్మం బురహాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో లాస్యశ్రీ తండ్రి చిన్న ప్రసాద్ కు అందజేశారు,ఈ సందర్భంగా ఆయన ఎంపీ రవిచంద్రకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఒత్తిడి అనేది కనిపించని బరువు.. దించుకుంటూ ముందుకు సాగితేనే జీవితం సాఫీ



- యోగా గురువు చాడ పాపిరెడ్డి
- నేడు అంతర్జాతీయ ఒత్తిడి నివారణ, అవగాహన దినోత్సవం

సూర్యాపేట నవంబర్ 4 వుదయం ప్రతినిధి

నేటి ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన ఒత్తిడికి గురవుతున్నారని, అటువంటి ఒత్తిడిని జయించడానికి యోగా ఒక అద్భుతమైన సాధనమని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు చాడ పాపిరెడ్డి సూచించారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఉద్యోగ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు, పోటీ ప్రపంచం, భవిష్యత్తుపై ఆందోళనలు మనిషి మానసిక ప్రశాంతతను దూరం చేస్తున్నాయని ఆయన అన్నారు. ఒత్తిడి అనేది జీవితంలో సహజమైనదే అయినప్పటికీ, దానిని నియంత్రించుకోలేకపోతే మన శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒత్తిడి ఎక్కువైనప్పుడు మనస్సులో ఆందోళన, చిరాకు, ఏకాగ్రత లోపం, నిద్రలేమి, అలసట వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. దీర్ఘకాలిక ఒత్తిడి శరీర ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసి రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఒత్తిడిని తొందరగా గుర్తించి, దానిని తగ్గించుకునే ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని సూచించారు. ఒత్తిడిని తగ్గించడంలో యోగా ఒక అద్భుతమైన సాధనమని చాడ పాపిరెడ్డి తెలిపారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం ద్వారా శరీరానికి విశ్రాంతి లభించడంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉండేందుకు ఎంతగానో సహాయపడుతుందని వివరించారు. నిత్య యోగా సాధన వల్ల శ్వాసపై నియంత్రణ, మానసిక స్థిరత్వం, ఏకాగ్రత, సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం కొంత సమయం యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం కోసం కేటాయించడం ద్వారా మనిషి తనలోని ఆందోళనను తగ్గించుకొని ప్రశాంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవచ్చని సూచించారు.

యోగాతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ప్రతిరోజూ నడక, కుటుంబ సభ్యులు, మిత్రులతో సంతోషంగా గడపడం కూడా ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆయన అన్నారు. ఒత్తిడిని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, దానిని సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని యోగా మనకు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకొని శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ అధికారుల చొరవతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మధిర, నవంబర్ 4, వుదయం, ప్రతినిధి:



మురసు తుఫాను ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మధిర 132 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి బోనకల్, మోటమర్రి, సిరిపురం సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసే ప్రధాన విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి పెద్ద గోపతి నుంచి ఆయా సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అందించారు. అనంతరం బుధవారం విద్యుత్ శాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన విరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించడంతో పాటు దెబ్బతిన్న విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తికావడంతో బోనకల్, మోటమర్రి, సిరిపురం సబ్‌స్టేషన్లకు మధిర 132 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి యథావిధిగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ మరమ్మతుల పనులను మధిర డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడీఈ అనురాధ, బోనకల్ ఏడీఈ ఆనంద్, మధిర రూరల్ సెక్షన్ ఏఈ మైథిలి, కలకోట ఏఈ మోహన్ పర్యవేక్షించగా విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొని పనులను విజయవంతంగా పూర్తి చేశారు.

క్రైస్తవ మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి



- క్రైస్తవులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి
- యూడీసీఫ్ ప్రెసిడెంట్ డి.ఐ. శాంసన్

నల్గొండ జిల్లా నవంబర్ 04, వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో మత ప్రచారం చేస్తున్నారనే నెపంతో ఇద్దరు క్రైస్తవ మహిళలపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని యూడీసీఫ్ ప్రెసిడెంట్ డి.ఐ. శాంసన్, ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు, ముఖ్యంగా మహిళలకు తగిన చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ చర్చిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని బడంగ్‌పేట సర్కిల్ పరిధిలో ఇద్దరు క్రైస్తవ మహిళలపై దాడి జరగడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా కొందరు అల్లరి మూకలు వ్యవహరిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగంలోని 25, 26 అధికరణాలు కల్పించిన మత స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. అదేవిధంగా హైదరాబాద్‌లో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వెళ్లిన క్రైస్తవులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు క్రైస్తవుల హక్కులకు, మత స్వేచ్ఛకు ప్రభుత్వం భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూడీసీఫ్ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దుబ్బ డేవిడ్ రాజు, హాలియా మండల అధ్యక్షుడు ఏపీ ప్రభాకర్, చంద్రపాల్, అజార్యా నాయక్, లింగారెడ్డి పాల్గొన్నారు.



కార్యకర్త కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

మునుగోడు, నవంబరు 4 (వుదయం):

రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వర్కాల సైదులు కుటుంబానికి టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవి ముదిరాజ్ రూ.10,000 ఆర్థిక సాయం ప్రకటించారు. మండల పరిధిలోని గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన సైదులు ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న రవి ముదిరాజ్ పంపిన ఆర్థిక సాయాన్ని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జంగిలి నాగరాజు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు. పార్టీ తరఫున కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈర్ల సత్తయ్య, బొల్లం మహేష్, బొల్లం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ పై కోర్టు కొరడా 6 మందికి జైలు శిక్ష, జరిమానా

చిలుకూరు నవంబర్ 04:(వుదయం)

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై న్యాయస్థానం కఠిన చర్యలు చేపట్టింది. చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 6 మందికి న్యాయస్థానం జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోదాడ న్యాయస్థానంలో బుధవారం మొత్తం 6 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు విచారణకు చిలుకూరు పోలీసులు హాజరపరచగా.

కేసులను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో ఆరు మందికి జైలు శిక్ష తో పాటు జరిమానా ఖరారు చేశారు. ఇందులో 3 మందికి ఒక్క రోజు, జైలు శిక్ష రూ. 1.000 జరిమానా విధించగా, మిగిలిన ముగ్గురు వ్యక్తులకు రూ.2,000 చొప్పున జరిమానా విధించింది, ఈ సందర్భంగా ఎస్సై మోహన్ బాబు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ ఇద్దరికి జైలు శిక్ష

అనంతగిరి నవంబర్ 04 వుదయం



మండల పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అనంతగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను బుధవారం కోదాడ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా మెజిస్ట్రేట్ వారికి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై ఏడుకొండలు తెలిపారు.అనంతరం ఇద్దరినీ హుజూర్‌నగర్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని,వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై ఏడుకొండలు హెచ్చరించారు.

విద్యుత్ శాఖలో విశేష సేవలందించిన పందిరి శ్రీనివాస్‌కు ఘన గౌరవం

పాలకీడ్ సెక్షన్‌లో ఏఈగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన శ్రీనివాస్

నల్గొండ జిల్లా నవంబర్ 04 వుదయం ప్రతినిధి



నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో విద్యుత్ శాఖలో బాధ్యతాయుతమైన పదవిలో పనిచేస్తూ ప్రజలకు, వినియోగదారులకు సేవలందించిన పందిరి శ్రీనివాస్ సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాలకీడ్ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆయన తన ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతాయుతమైన పనితీరుతో గుర్తింపు పొందారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యల పరిష్కారం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన విధులను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాల్లో ఆయన తనదైన సేవలందించారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ విధి నిర్వహణకు ప్రాధాన్యత నిస్తూ ముందుకు సాగారు. మిర్యాలగూడలోని వైష్ణవ్ హోటల్‌లో ఆయనకు సంబంధించిన కార్యక్రమం సందర్భంగా పలువురు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలియజేశారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో అనుభవం, సేవాభావం, నిబద్ధత కలిగిన పందిరి శ్రీనివాస్ భవిష్యత్తులోనూ సమాజానికి తన అనుభవాన్ని అందించాలని పలువురు ఆకాంక్షించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి:ఎంఈఓ

అనంతగిరి నవంబర్ 04 వుదయం



మండల పరిధిలోని త్రిపురవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల స్థాయి ప్రైమరీ లెవల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి మిర్యాల వెంకటయ్య హాజరై ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మిర్యాల వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.పాఠశాలకు సకాలంలో హాజరు కావడం,తరగతులను నిర్ణీత సమయంలో ప్రారంభించడం,విద్యార్థుల పట్ల బాధ్యతగా విధులు నిర్వహించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని గుర్తు చేశారు.నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు రోజు రోజుకూ పెరిగేలా కృషి చేయాలన్నారు.విద్యార్థుల హాజరు శాతాన్ని 100 శాతానికి తీసుకు రావాలని,చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.అక్షరాస్యత,అంకెలు,బేసిక్ లెర్నింగ్ సామర్థ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని ఆదేశించారు.పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలు,మౌలిక వసతులు,విద్యార్థుల ప్రగతి నివేదికలు,రాబోయే పరీక్షల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు.ఉపాధ్యాయులు తమ సందేహాలను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలు సూచించారు.సమావేశం అనంతరం విద్యా ప్రమాణాల అభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ లక్ష్మి నరసయ్య,కాంప్లెక్స్ సమావేశంలో మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సహాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేధింపులపై మౌనం వద్దు.. ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్

యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి



ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల భద్రత, మహిళా హక్కులు, ఈవ్ టీజింగ్, వేధింపులు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలు, ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందే మార్గాల గురించి వివరించారు. Dial 112 & She teams 8712665338 మహిళల భద్రతకు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ తమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా మధిర డిపోలో విధుల బహిష్కరణ



మధిర, నవంబర్ 4, వుదయం, ప్రతినిధి:

మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికపై ప్రయాణికురాలు జరిపిన అమానుష దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె, గత పది రోజులుగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ మంగళవారం రాత్రి 10:30 గంటలకు తుదిశ్వాస విడిచారు. కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మధిర డిపో కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు.ఈ విషాదకర ఘటనను నిరసిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధిర డిపోలో మొదటి బస్సు నుంచే కార్మికులు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతూ, ఎండనకా, వాననకా ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల ప్రాణాలకే రక్షణ లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కండక్టర్ ప్రవళిక మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు ఆర్టీసీ ఉద్యోగులందరికీ విధి నిర్వహణలో పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మధిర డిపో జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవళిక మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎల్ఐసి వ్యాపారంలో కరకాల సుదర్శన్ ను ఆదర్శంగా తీసుకోవాలి

- సుదర్శన్ గృహానికి విచ్చేసి సన్మానించిన సీనియర్ డివిజనల్ మేనేజర్
- ప్రభాత్ కుమార్ సాహు సికింద్రాబాద్ డివిజన్, సీనియర్ డివిజనల్ మేనేజర్

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి





భారతీయ జీవిత భీమా సంస్థలో కొత్త ఏజెంట్ల నియామకంలో, నూతన వ్యాపారంలో భువనగిరి డివిజన్ స్థాయిలో నెంబర్ వన్‌గా నిలిచిన భువనగిరికి చెందిన కరకాల సుదర్శన్ ను ఎల్ఐసి సంస్థ ఆదర్శంగా తీసుకోవాలని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహూ అన్నారు. బుధవారం ఎల్ఐసీ ఉన్నత స్థాయి అధికారులతో కలిసి భువనగిరి లోని కరకాల సుదర్శన్ గృహానికి స్వయంగా విచ్చేసి పూలమాలలు, మెమెంటోలతో సుదర్శన్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ కరకాల సుదర్శన్, నూతన ఏజెంట్ల నియామకంలో డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడంతో పాటు, "సన్మాన యాత్ర" పోటీలో కూడా అత్యధికంగా నూతన వ్యాపారం చేసి నెంబర్ వన్ స్థానంలో నిలిచారని అన్నారు. సీఎల్ఐఏ మేనేజర్ స్వర్ణలత, భువనగిరి బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. బలరాం, ఏఓ కేశవ్, ఏబీఎం సుధాకర్ రావులతో కలిసి సుదర్శన్ ఇంట్లో "ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రాన్ని" ప్రారంభించారు. అనంతరం కరకాల సుదర్శన్ నాయకత్వంలోని అచీవర్స్ ఫ్యామిలీ టీమ్‌కు చెందిన ఏజెంట్లు పొట్ట హేమలత జగన్, మీసాల లక్ష్మీ రాజయ్య, పులి అనిత సాయికుమార్ లతో పాటు ఇతర ఏజెంట్ లను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచీవర్స్ ఫ్యామిలీ టీమ్ ఏజెంట్లు నిలుగొండ వెంకట రాజు, పులిజాల హేమలత, అర్ధం రాధా, దోసపాటి మురళి, మద్దూరు జంగయ్య, పసల కరుణ, పెంటబోయిన పుష్ప, నాగరాజు, ఇతర ఏజెంట్లు, కాలనీవాసులు, ఎల్ఐసీ భువనగిరి బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!

కార్యదర్శుల ఇష్టారాజ్యం!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు ఉదయాన్నే హాజరు నమోదు చేసుకొని కార్యాలయాల నుంచి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు చుంచుపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా రాంపురం, అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీల్లో కార్యదర్శుల పని తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. వర్షాల కారణంగా గ్రామాల్లో వరదనీరు చేరడం, కాలువలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలవడం వంటి పరిస్థితులు నెలకొన్నప్పుడు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తం చేయడంతో పాటు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన సమయంలో కార్యాలయాలకే తాళాలు వేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు రావడం గమనార్హం.

ఉదయం 10:30కే కార్యాలయాలకు తాళాలు!

రాంపురం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేశ్వరికి పెనగడప గ్రామపంచాయతీ అదనపు బాధ్యతలు కూడా అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు గ్రామపంచాయతీల విధులను నిర్వహించాల్సిన ఆమె ఉదయాన్నే హాజరు నమోదు చేసుకొని వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో రాంపురం, పెనగడప గ్రామపంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేసి ఉండటం విధుల నిర్వహణపై పలు అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు.

పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల ఇబ్బందులు

అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి తాళం వేసి ఉన్నప్పటికీ కార్యదర్శి కార్యాలయంలోనే ఉన్నానని చెప్పడం పలు సందేహాలకు దారితీస్తుంది . గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై కూడా సరైన శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీ కి చెందిన కుక్కముడి నాగ మాట్లాడుతూ తమ ఇంటి ఆవరణలో వర్షపు నీరు భారీగా నిలిచిపోతోందని తెలిపారు. ఇంటి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఇంటి ఆవరణలో నిలిచిన నీటిలోకి విద్యుత్ సరఫరా వస్తుందని వాపోతున్నారు. ఎనిమిది నెలల క్రితం తమ కుమార్తెకు విద్యుత్ షాక్ తగిలి చేతికి గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ అధికారికి చెప్పిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సైడ్ డ్రైనేజీలు, పారిశుద్ధ్య నిర్వహణ, కాలనీలోకి వెళ్లడానికి సైడ్ డ్రైనేజీ కాలువలపై దాటి





అవతల వైపు వెళ్లడానికి ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని వాటి పైనుంచి వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రతిరోజు ఒకటి రెండు గంటలు మాత్రమే కార్యాలయంలో ఉంటున్నారనే ఆరోపణలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా వారికి వచ్చిన ఇందిరమ్మ ఇల్లును సైతం లిస్టులో వచ్చిన తర్వాత కూడా ఇతరులకు అందించినట్లు ఆమె తెలిపారు.

అధికారుల ఆదేశాల అమలు ఎక్కడ?

జిల్లా అధికారులు ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ, వర్షాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్న సమయంలో గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాల్లో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? కార్యాలయ సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, విధుల్లో నిర్లక్ష్యం వహించినా అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిని వివరణ...

ఈ విషయంపై చుంచుపల్లి మండల ఎంపీడీవో సుభాషిణిని వివరణ కోరగా, రాంపురం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేశ్వరి ఆరోగ్యం బాగోలేదని, విధులకు రాలేనని చెప్పడంతో తానే గ్రామపంచాయతీకి వెళ్ళమని ఆదేశించినట్లు తెలిపారు. కార్యదర్శి గ్రామపంచాయతీకి వెళ్లిన తర్వాత పర్మిషన్ తీసుకొని వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బాబు క్యాంప్ గ్రామపంచాయతీకి చెందిన కార్యదర్శిని రాంపురం గ్రామపంచాయతీకి పంపిస్తానని వెల్లడించారు. అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ కార్యాలయానికి తాళం వేసి ఉన్నప్పటికీ తాను కార్యాలయంలోనే ఉన్నానని చెప్పడంపై ఎంపీడీవోను ప్రశ్నించగా, ఈ విషయంపై మాట్లాడి చెబుతానని సమాధానమిచ్చారు.

రాంపురం కార్యదర్శి మహేశ్వరి వివరణ

రాంపురం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేశ్వరిని కార్యాలయానికి తాళం వేసి ఉన్న విషయంపై వివరణ కోరగా, తన ఆరోగ్యం బాగోలేకపోవడంతో అనుమతి తీసుకొని వెళ్లిపోయానని తెలిపారు.

అంబేద్కర్ నగర్ పంచాయతీ కార్యదర్శి అరుణ వివరణ...

అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణను ఫోన్ ద్వారా సంప్రదించి కార్యాలయంలో అందుబాటులో ఉన్నారా? అని ప్రశ్నించగా, తాను కార్యాలయంలోనే ఉన్నానని, ఉప సర్పంచ్ తో పాటు తాను బ్యాంకులో పని ఉండి వెళ్తున్నామని సమాధానం ఇచ్చారు. అదే సమయంలో వుదయం ప్రతినిధి కార్యాలయం వద్దనే ఉండగా కార్యాలయానికి తాళం వేసి ఉంది తాళం వేసిన కార్యాలయంలో ఉన్నానంటూ చెప్పడం గమనార్హం.

ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులే కార్యాలయాల్లో లేకపోతే గ్రామ సమస్యలను పరిష్కరించేదెవరు? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతార్ చేస్తూ హాజరు నమోదు అనంతరం ఇంటి బాట పడుతున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపక్షాల ప్రచారానికి చెక్

మంత్రి నిజాయితీకి ఇదే నిదర్శనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



రాజకీయంగా ఎదుర్కోలేకే ప్రతిపక్షాలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఆళ్ల మురళికి సంబంధించిన వ్యవహారం ఆయన వ్యక్తిగత వ్యాపారానికి సంబంధించిన అంశమని, దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే సంబంధిత మిల్లుపై దాడులు చేపట్టారని తెలిపారు.

తప్పు చేసిన వారు తనకు ఎంతటి ఆప్తులైనా మంత్రి పొంగులేటి ఉపేక్షించరని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. అధికారులపై మంత్రి రాజకీయ ఒత్తిళ్లు తీసుకొస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు. మంత్రి పుట్టినరోజు నాడే సంబంధిత మిల్లుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేయడం ఇందుకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కోర్టు ఆదేశాలు, నిర్ణయాలకు అనుగుణంగానే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వానికి ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదని, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. రాజకీయ విమర్శల పేరుతో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తోట దేవి ప్రసన్న ప్రతిపక్షాలకు హితవు పలికారు.

జ్ఞాపకాల పందిరిలో.. 48 ఏళ్ల నాటి పదో మిత్రులు!



ఆందోళ్ మైసమ్మ వద్ద 1976 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చండూరు, నవంబర్ 4(వుదయం):

కాల చక్రం వేగంగా తిరిగినా.. ఐదు పదుల కాలం సమీపిస్తున్నా ఆనాటి బడి జ్ఞాపకాలు, చెరగని మైత్రి ముందర వయస్సు చిన్నబోయింది! చండూరులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆందోళ్ మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆత్మీయంగా కలుసుకున్నారు.

దశాబ్దాల క్రితం పాఠశాల ఆవరణలో గడిపిన తీపి గుర్తుల్ని, ఆటపాటల్ని, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా ఒకే చోట చేరడంతో ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకుంటూ, నాటి చమత్కారాలు గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య రోజంతా గడిపారు.ఈ ఆత్మీయ కలయికలో సుమారు 36 మంది పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పున్నమి అంజయ్య, వనమాల శేఖర్, సీహెచ్ బాల్‌రెడ్డి, గుంటి రామలింగం, కొండూరు వెంకన్న, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం ఖిల్లా రోప్‌వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- రోప్‌వే సేవలను ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి
- రోప్‌వేకు అనుబంధంగా మౌళిక వసతుల కల్పనకు పక్కా ప్రణాళ

హైదరాబాద్, వుదయం బ్యూరో నవంబర్ 4



ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితి లోగా పూర్తి చేసి, ప్రజలకు త్వరితగతిన రోప్‌వే సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతిపై రోప్‌వే నిర్మాణ సంస్థ సీఈఓ రంజిత్ పరకాసి హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను, పర్యాటక ఆకర్షణను దృష్టిలో ఉంచుకుని రోప్‌వే ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్దేశించిన గడువుకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. రోప్‌వే ప్రారంభమైన అనంతరం పర్యాటకులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రోప్‌వేకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, ఇతర మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సందర్శకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రోప్‌వే నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం ఖిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసి రోప్‌వే సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

మునగాల, నవంబర్ 4 (వుదయం):

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై మునగాల మండలంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృత అవగాహన ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని న్యూ ప్రజ్ఞా హైస్కూల్‌లో పట్టభద్రులు, విద్యావంతులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుంకరి అజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్ మాట్లాడుతూ 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న వారు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి పట్టభద్రులు తమ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, వేట శివాజీ, వి. నరసింహారావు, పాఠశాల కరస్పాండెంట్ కాచాని కృష్ణమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై ముందస్తు హెచ్చరికలు.. ‘చండూరు’లో ప్రత్యేక అవగాహన సదస్సు

చండూరు, నవంబర్ 4(వుదయం)



రాబోయే ఎండల తీవ్రత, ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ప్రజలు ఇప్పటి నుంచే నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని చండూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ భూతరాజు దశరథ్, కమిషనర్ ఎల్. మల్లేశం పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ భూతరాజు దశరథ్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. నీరు అత్యంత విలువైన సహజ వనరని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి అవసరాలకు సరిపడా మాత్రమే వాడుకోవాలన్నారు. కుళాయిల వద్ద లీకేజీలు ఉంటే వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలు ఇప్పటి నుంచే సంరక్షణ చర్యలు ప్రారంభించాలన్నారు. వర్షపు నీటిని భూమిలోకి మళ్లించేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాగునీటిని ఇతర పనులకు వృథా చేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో మున్సిపల్ మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఏ. సాయిభరద్వాజ్, వార్డు అధికారులు జి. శ్రీరాములు, బి. సాయిరాం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యం. అరవింద్ రెడ్డితో పాటు బిల్ కలెక్టర్లు, ఆర్‌పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు మరియు 8వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ మృతికి నేతల సంతాపం



మునగాల, నవంబర్ 4 (వుదయం):

సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని భరాకత్‌గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల సత్యనారాయణ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వంగవేటి రామారావు తదితర నాయకులు భరాకత్‌గూడెం గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి ఏనుగుల సత్యనారాయణ అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి శ్రీనివాస్ కాసర్ల కోటేశ్వరరావు, ఓరుగంటి రవి, పోటు అశోక్ కుమార్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తే సైబర్ నేరాలకు అసలైన రక్షణ

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

భువనగిరి ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరితోనూ OTP, బ్యాంక్ ఖాతా వివరాలు, UPI PIN వంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ , ఎస్ఐలు నాగరాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఫ్లోరైడ్ సమస్యపై వాస్తవాలు వెలికితీయాలి

ఎన్‌హెచ్ఆర్‌సీకి సామాజిక కార్యకర్త, న్యాయవాది వినోద్ హిందుస్థానీ సూచన

మర్రిగూడ, నవంబర్ 4 (వుదయం):

నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చిన జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) బృందానికి సామాజిక కార్యకర్త, న్యాయవాది వినోద్ హిందుస్థానీ పలు కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఇంకా పరిష్కారం కాని సమస్యలను వినోద్ హిందుస్థానీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిలదీశారు. ముఖ్యంగా ఫ్లోరోసిస్ బారిన పడి దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న పాత బాధితులకు తగిన ఆర్థిక సహాయం అందించే విషయంలో నిర్లక్ష్యం తగదని ఆయన ప్రశ్నించారు. అలాగే, వ్యవసాయానికి బోర్ల ద్వారా భూగర్భ జలాలను వాడటం వల్ల వరి తదితర పంటలపై ఫ్లోరైడ్ ప్రభావం పడుతోందన్న ఆందోళనలను ఆయన గట్టిగా వినిపించారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్‌సీ అధికారి మాట్లాడుతూ.. బాధితుల ఆర్థిక సాయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వస్తే తప్పకుండా పరిశీలిస్తామన్నారు. పంటలు కలుషితం అవుతున్నాయనడానికి ప్రస్తుతం ఆధారాలు లేనప్పటికీ, ఫ్లోరైడ్ ప్రభావం గురించి కచ్చితంగా శాస్త్రీయ పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అంగీకరించారు. పూర్తి పునరావాసం కల్పించేవరకు బాధితుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని వినోద్ స్పష్టం చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు

తొమ్మిది మందిపై కేసులు.. జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించిన న్యాయస్థానం


మునగాల, నవంబర్ 4 (వుదయం):



మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మందికి కోర్టు జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించింది. మునగాల ఎస్సై మల్లు సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవంబర్ 3న మునగాల గ్రామంలోని గణపవరం రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వారు నిర్ణీత పరిమితికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం (నవంబర్ 4) నిందితులను కోదాడ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.డి. ఉమర్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం ఇద్దరికి రూ.2 వేల జరిమానాతో పాటు ఒకరోజు జైలు శిక్ష, మరో కరికి రూ.2 వేల జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగిలిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నెడపడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై సంజీవరెడ్డి హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వీడియో కాన్ఫరెన్స్

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి




వ్యవసాయంలో పంటల వైవిధ్యీకరణ, గృహ నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మునగ సాగు, గృహ నిర్మాణ పథకం రెండో విడత మంజూరీలు, VB-G RAM G పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. మునగ సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణ పథకం రెండో విడతలో ఇళ్ల మంజూరీకి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాలు, పురోగతి, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా ప్రారంభమయ్యేలా, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. మండలాలలో అర్హులు అయినా రూఫ్ రీప్లేస్‌మెంట్ లబ్ధిదారులు గుర్తించి జాబితా లను గెజిటెడ్ ఆఫీసర్ వచ్చి వెరిఫికేషన్ చేపించి పంపించగలరు. ఇందిరమ్మ ఇండ్ల లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. VB-G RAM G పథకం కింద చేపట్టాల్సిన పనులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనుల గుర్తింపు, పనుల అమలు, పురోగతిపై సమీక్షించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కూలీల సంఖ్య ను పెరిగే లా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య లు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు అంగన్వాడీ, వివో, గ్రామపంచాయతీ, స్కూల్ కాంపౌండ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ నాగిరెడ్డి వ్యవసాయ అధికారి రమణా రెడ్డి , హౌసింగ్ పీడీ అలివేలు , డీహెచ్ఎస్ఓ, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఓలు, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఖబర్దార్ బిఆర్ఎస్ నాయకులారా

తీవ్రంగా హెచ్చరించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ తిరుమల గంగాధర్

కోరుట్ల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కోరుట్ల నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులను తీవ్రంగా హెచ్చరరించిన కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ తీవ్రంగా హెచ్చరించారు కోరుట్ల పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంగాధర్ మాట్లాడుతూ కల్వకుంట చంద్రశేఖర్ రావు సిద్దిపేట వ్యక్తి అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకుంటున్న గజ్వేల్ ఎమ్మెల్యే ఇప్పుడు అదే విధంగా కేటి రామారావు సిద్దిపేట వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే హరీష్‌రావు ఉమ్మడి కరీంనగర్ జిల్లా తోటపల్లికి చెందిన వ్యక్తి వీరందరూ కూడా వివిధ జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో పోటీ చేస్తూ తెలంగాణ మొత్తం తమ జాగీర్ అనుకుంటున్నరని కోరుట్ల టిఆర్ఎస్ నాయకులు వారు వారి సొంత నియోజకవర్గాల్లో కాకుండా పక్క నియోజకవర్గాల్లో ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు అదే విధంగా దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు కుమారుడు జువ్వాడి కృష్ణారావు నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమై అవినీతి మచ్చ లేనటువంటి ప్రజా నాయకుడు అని అన్నారు నియోజకవర్గంలో మంచితనానికి నిజాయితీకి మారుపేరుగా నిలిచింది కృష్ణారావు అని అన్నారు ఏ కార్యకర్తకు ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేనున్నానని ముందుండే కృష్ణరావును మరొక్కసారి విమర్శిస్తే సహించేది లేదని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు ముందు మీ(వీకెండ్) వారాంతం ఎమ్మెల్యే మీద మీ కార్యకర్తలకు అవగాహన లేదు నియోజకవర్గం మీద మీ ఎమ్మెల్యేకి అవగాహన లేదు అలాంటి మీరా మా నాయకుడిని విమర్శించేది ఖబర్దార్ అంటూ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పట్టణంలోని మునిసిపల్ కౌన్సిలర్ వైస్ చైర్మన్ షాహిద్ సొగ్రాభి తోట గంగాధర్ జగిత్యాల జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నయీమ్ కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతంరాజం రమేష్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్ష

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న 2BHK గృహ సముదాయాల్లో అవసరమైన 5మౌలిక వసతుల కల్పనకు సంబంధించి చేపట్టిన పనుల పురోగతి, ప్రస్తుత స్థితిగతులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (LB) మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో PD (Housing), DEEలు, AEలు, మిషన్ భగీరథ EEలు, Dy.EEలు, AEలు, EE (PH) మరియు విద్యుత్ శాఖ AEలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2BHK గృహ సముదాయాల్లో తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, అలాగే పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు 2BHK గృహాలను పంపిణీ చేసే సమయానికి అన్ని అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గృహాల పంపిణీకి ముందుగానే తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ మరియు ఇతర ప్రాథమిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ పి.డి.ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌పై ఉద్యోగులకు మూడు రోజుల శిక్షణ



మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, ఉద్యోగుల పనితీరు సామర్థ్యం పెంపొందించడంతో పాటు పేపర్‌లెస్ పాలనను ప్రోత్సహించేందుకు ఉద్యోగులకు డిజిటల్ విధానాలపై శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌లో భాగంగా నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు eHRMS, E SANCTIONS WAMIS, ఐఎఫ్ఎంఐఎస్ (IFMIS) తదితర డిజిటల్ మాడ్యూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ డిజిటల్ వ్యవస్థలోకి తీసుకువచ్చి పేపర్‌లెస్ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఉద్యోగులందరికీ డిజిటల్ విధానాలపై శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిజిటల్ వ్యవస్థ ద్వారా ఉద్యోగుల పనితీరు సామర్థ్యం పెరగడంతో పాటు పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మెరుగుపడతాయని అన్నారు. గతంలో కార్యాలయాల్లో ఒకరి నుంచి మరొకరికి ఫైళ్లను కాగితాల రూపంలో పంపించాల్సి వచ్చేదని, ప్రస్తుతం డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగులు తమ స్థానాల్లోనే ఉండి ఫైళ్లను ఒకరి నుంచి మరొకరికి ఆన్‌లైన్‌లో పంపించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. దరఖాస్తులు, ఫైళ్ల ప్రస్తుత స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. నవంబర్ 15 నుండి అన్ని ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ విధానం అమలు కానుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖకు సంబంధించిన విధులు, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక డిజిటల్ మాడ్యూల్స్ రూపొందించినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖలో పంచనామాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలకు సంబంధించిన కార్యకలాపాలు, ఇంజినీరింగ్ శాఖలో ఆ శాఖకు సంబంధించిన పనులు ,అని ప్రభుత్వ శాఖల పరిధిలోనే డిజిటల్ విధానంలో నిర్వహించుకునేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఉద్యోగులందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని డిజిటల్ విధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి,జిల్లా ట్రెజరీ అధికారి బి.శ్రీనివాస్,పి.ఏ.ఓ.వి.ఎస్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- భాషా నైపుణ్యాలు, రాత సామర్థ్యాలు, గణితంలో ప్రాథమిక నైపుణ్యాల సాధనపై దృష్టి సారించాలి
- రెమిడియేషన్, AXL AI, ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి

జూలపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, భాషా నైపుణ్యాలు, రాత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం జూలపల్లి లోని జడ్పీహెచ్ఎస్ లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రెమిడియేషన్, AXL AI, ఎఫ్.ఎల్.ఎన్. తరగతుల నిర్వహణను మండల విద్యాధికారులు (ఎం.ఈ.ఓలు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, విద్యార్థుల నమోదు, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరాక్ పరీక్షకు సంబంధించి ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై కూడా మార్గనిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో కేవలం బోధించేవారిగా కాకుండా విద్యార్థుల అభ్యసనానికి మార్గనిర్దేశం చేసే ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను స్వయంగా మాట్లాడేలా, అర్థం చేసుకున్న విషయాలను తమ మాటల్లో వ్యక్తీకరించేలా ప్రోత్సహించాలని తెలిపారు. కేవలం వినడం, చదవడంతో పరిమితం కాకుండా సృజనాత్మకంగా ఆలోచించి రాసే సామర్థ్యాన్ని పెంపొందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి నాలుగు ప్రధాన భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా అదనపు బోధన అందించాలని తెలిపారు. రాత నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ 100 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

రెమిడియేషన్ తరగతులపై ప్రత్యేక పర్యవేక్షణ

తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అనే నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో ప్రతి విద్యార్థి వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని తెలిపారు తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తూ, ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎం.ఈ.ఓలు, హెచ్.ఎం.లకు సూచించారు. AXL AIలో విద్యార్థుల నమోదు, అభ్యసన ఫలితాల పర్యవేక్షణ AXL AI కార్యక్రమంలో విద్యార్థుల నమోదు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, డిజిటల్ అభ్యసన విధానం ద్వారా విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల వినియోగం, అభ్యసన ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన స్ఫూర్తితో, ఉన్నత తరగతుల్లోనూ విద్యార్థులు మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల తరగతి గది బోధనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.



భీమేశ్వరుడి సన్నిధిలో కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ

వేములవాడ, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ జి. బసవరెడ్డి బుధవారం దర్శించుకున్నారు, ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీకి అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు, అనంతరం ఆలయ ఈవో రమాదేవి శేషవస్త్రంతో ఎస్పీని సత్కరించి, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్, పర్యవేక్షకులు నరేందర్, సీనియర్ అసిస్టెంట్ నక్క తిరుపతి, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

అధికారులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

దసరా ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు తగిన ప్రోటోకాల్ పాటించకుండా, అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పర్స విజయ్‌కుమార్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరారు. రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి మున్సిపల్ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్ గెజిట్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, మళ్లీ అదే పరిస్థితి నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణంలో జగిత్యాల వాసులు

జగిత్యాల నవంబర్ 01 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణంలో సహ నిర్మాత లుగా జగిత్యాల నివాసులు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులు ఉన్నారు తెలంగాణ ఈ చిత్ర దర్శకుడు ఎం సేనాపతి మాట్లాడుతూ తెలంగాణ వీరుల చరిత్రను దొడ్డి కొమరయ్య సినిమా ద్వారా ప్రపంచానికి పరిచయం చేయబోతున్నామన్నారు జగిత్యాల జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ చిత్ర సహనిర్మాతలు మానాల కిషన్ సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ లు మాట్లాడుతూ తెలంగాణ వాళ్లు కూడా తెలుగు చిత్ర పరిశ్రమను ఏలే రోజులు రావాలన్నారు తెలంగాణ అమరవీరుల ఆశయాలను సాధించడం కోసంముందుకు రావాలన్నారు జగిత్యాల జిల్లాలో దొడ్డి కొమరయ్య సినిమా సహనిర్మాతలు వీరే అడువాల జ్యోతి హరి అశోక్ కుమార్ పుప్పాల హనుమంత్ రెడ్డి పిట్ట ధర్మరాజు వొళ్లెం మల్లేశం బల్కం మల్లేష్ యాదవ్ మరిపెల్లి నారాయణ సింగం భాస్కర్ సింగం పద్మ ఆడేపు జానయ్య పుల్ల మల్లయ్య దయ్యాల మల్లారెడ్డి ఎండి యాకూబ్ భారతపు లింగారెడ్డి జవ్వాజీ శంకర్ బొమ్మెర రాజశేఖర్ జిల్లా గంగాధర్ లు పాల్గొన్నారు.

ప్రతి బ్యాంకు ఖాతాదారునికి ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- రూపే కార్డులు యాక్టివేట్ చేసుకున్న ఖాతాదారులందరికీ ప్రమాద బీమా ప్రయోజనాలు అందాలి
- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఖాతాదారులకు రూ.10 వేల వరకు ఓడీ సౌకర్యంపై విస్తృత ప్రచారం చేయాలి
- బ్యాంకర్లతో నిర్వహించిన డిసిసి డీఎల్ఆర్సి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

జిల్లాలోని బ్యాంకు ఖాతాదారులందరికీ అర్హత మేరకు ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) సౌకర్యం అందుబాటులో ఉండేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. రూపే డెబిట్ కార్డులు పొందిన ఖాతాదారులందరూ వాటిని యాక్టివేట్ చేసుకొని ప్రమాద బీమా ప్రయోజనాలు పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో కలిసి బ్యాంకర్లతో నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని బ్యాంకుల పనితీరు, వార్షిక రుణ ప్రణాళిక అమలు, సామాజిక భద్రతా పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు బ్యాంకులు అందిస్తున్న ఆర్థిక సదుపాయాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి బ్యాంకు ఖాతాదారునికి అర్హత మేరకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. రూపే కార్డులు పొందిన వారందరూ వాటిని యాక్టివేట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారికి అందుబాటులో ఉన్న ప్రమాద బీమా ప్రయోజనాలు పొందేలా చూడాలని ఆదేశించారు.

ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలి

ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేకంగా ఆర్థిక అక్షరాస్యత అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ శిబిరాల ద్వారా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన , అటల్ పెన్షన్ యోజన (APY) పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయా పథకాలలో నమోదు చేసుకునేలా బ్యాంకర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద సంవత్సరానికి కేవలం రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందని, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద సంవత్సరానికి రూ.436 ప్రీమియంతో జీవిత బీమా సౌకర్యం అందుబాటులో ఉందని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ రెండు పథకాల ప్రీమియం సాధారణంగా ప్రతి సంవత్సరం మే, జూన్ నెలల్లో ఖాతాల నుంచి మినహాయింపు అవుతుందని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో నమోదు చేసుకున్న అర్హులైన ఖాతాదారులకు రూ.10,000 వరకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం పొందే అవకాశం ఉందని, ఆర్థిక అవసరాలు ఉన్నవారు ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ఖాతాదారులకు అందుబాటులో ఉన్న రూ.10 వేల వరకు ఓడీ సౌకర్యంపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు.


వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించాలి

జిల్లాలో సెప్టెంబర్ 30, 2026 నాటికి బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.18,498 కోట్లుగా ఉండగా, డిపాజిట్లు రూ.8,708.32 కోట్లు, అడ్వాన్సులు రూ.9,789.68 కోట్లుగా నమోదయ్యాయని సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 112.42 శాతంగా ఉందని తెలిపారు. 2026–27 వార్షిక రుణ ప్రణాళిక కింద రూ.7,358.40 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.4,047.34 కోట్ల రుణాలు పంపిణీ చేసి 55 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు. ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను పూర్తి చేసేందుకు బ్యాంకర్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

వ్యవసాయ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, బలహీన వర్గాలకు రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైని డిప్యూటీ కలెక్టర్ వనజ,లీడ్ బ్యాంకు మేనేజర్ డి. ప్రవీణ్ కుమార్, ఆర్ . సేటీ డైరెక్టర్ వెంకటేష్,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కే నాగరాజు, ఆర్బిఐ అధికారి గోరేఖ, నాబార్డ్ డిడి ఎం జయప్రకాష్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై ఆకతాయి విధ్వంసం..

'మన మహబూబ్‌నగర్' సైన్‌బోర్డు ధ్వంసం.. పోలీసులకు మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు కేసు నమోదు



మహబూబ్‌నగర్, వుదయం ప్రతినిధి

మహబూబ్‌నగర్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై గుర్తుతెలియని వ్యక్తి విధ్వంసానికి పాల్పడ్డారు. ఇటీవలే మినీ ట్యాంక్ బండ్ పై ప్రారంభించిన 'మన మహబూబ్‌నగర్' సైన్‌బోర్డు, అలాగే అక్కడ ఏర్పాటు చేసిన ఇతర సైన్‌బోర్డులను ధ్వంసం చేశారు. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఆకతాయి మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన పార్కులో హల్‌చల్ చేస్తూ సైన్‌బోర్డులను ధ్వంసం చేశారు.సంఘటన సి.సి. టి.వి.ఫుటేజీ లో రికార్డ్ అయింది. అనంతరం ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసులు మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పట్టణ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన పార్కులు, సైన్‌బోర్డులు, ఇతర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం బాధ్యతారాహిత్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి విధ్వంసక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

తెలంగాణ రక్షణ సేన బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- తెలంగాణ రక్షణ సేన జిల్లా నూతన కమిటీల నియామకం
- పాంచజన్యాలు,భూలక్ష్మి విధానాలను గడపగడపకూ చేర్చాలి
- జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య
- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్ నియామకం



పెద్దపల్లి,నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

క్షేత్రస్థాయిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడంతో పాటు బడుగు,బలహీన వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పార్టీ బీసీ సెల్ కమిటీలను నియమించాం అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య స్పష్టం చేశారు.తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా,నియోజకవర్గ మరియు మండల స్థాయి నూతన కమిటీలను స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య అధికారికంగా ప్రకటించారు.క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే సమర్థులైన నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు వారు వెల్లడించారు.ఈ నియామకాల్లో భాగంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్,జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా భోగాని శంకర్ గౌడ్,పెద్దపల్లి నియోజకవర్గ స్పోర్ట్స్ వింగ్ అధ్యక్షురాలిగా దాడి స్రవంతి బాధ్యతలు స్వీకరించారు.మండల స్థాయి కమిటీల్లో భాగంగా పెద్దపల్లి రూరల్ అధ్యక్షుడిగా ఉప్పు ఘట్టేష్,ప్రధాన కార్యదర్శిగా ఎంచెర్ల స్వామి నియమితులు కాగా,సుల్తానాబాద్ రూరల్ అధ్యక్షుడిగా మల్యాల కరుణాకర్,ప్రధాన కార్యదర్శిగా పోసాని కృష్ణలకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య మాట్లాడుతూ వెనుకబడిన, బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నూతన కమిటీల ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంకల్పించిన పాంచజన్యాలైన నాణ్యమైన ఉచిత విద్య,వైద్యం,ఆరోగ్యం,సామాజిక న్యాయం వంటి ఐదు కీలక అంశాలతో పాటు,భూమి లేని నిరుపేదలకు, నిర్వాసితులకు అండగా నిలిచే ప్రతిష్టాత్మక భూలక్ష్మి – ఎకరం భూమి విధానాన్ని గ్రామగ్రామాన ప్రతి గడపకూ చేరవేసే బాధ్యతను కార్యకర్తలు భుజానకెత్తుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు గడువు పొడిగింపు కోసం పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్వయంగా ఎన్నికల సంఘాన్ని కలిసి పోరాడారని, ఆమె విజ్ఞప్తికి స్పందించి గడువు పెంచినందుకు ఎన్నికల కమిషన్‌కు పెద్దపల్లి జిల్లా కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని నాయకులు స్పష్టం చేశారు.తమపై సంపూర్ణ విశ్వాసంతో గురుతర బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు నూతన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్, కమిటీల బాధ్యులు కృతజ్ఞతలు తెలుపగా, కొత్తగా ఎన్నికైన వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి క్రయవిక్రయాలు బంద్

- రైతులు రేపు పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకురావద్దు
- జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)


వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అలాగే పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నేడు రైతులు తీసుకువచ్చిన పత్తికి సంబంధించిన కాంటాలు రేపటి రోజున నిర్వహించవలసి ఉన్నందున, మార్కెట్ యార్డులోని అడ్తిదారులు మరియు పత్తి కొనుగోలుదారుల విజ్ఞప్తి మేరకు రేపు అనగా 05.11.2026 (గురువారం) రోజున పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి క్రయవిక్రయాలు నిలిపివేయబడుతున్నాయి. కావున పత్తి రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, రేపు (05.11.2026) పత్తిని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి సూచించారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించగలరని కోరడమైనది.

ధర్మపురి బీజేపీ మండల పదాధికారుల, మోర్చా అధ్యక్షుల నియామకం

ధర్మపురి,నవంబర్ 4(వుదయం ప్రతినిధి):

భారతీయ జనతా పార్టీ ధర్మ పు రి మండల పదాధికారులు,మో ర్చా అధ్యక్షులను నియమించి నట్లు మండల అధ్యక్షుడు కుమ్మ రి తిరుపతి తెలిపారు.బీజేపీ జి ల్లా అధ్యక్షులు రాచకొండ యాద గిరి బాబు ఆదేశానుసారం ఈ నియామకాలు తక్షణమే అమ ల్లోకి వస్తాయని తెలిపారు.మం డల ఉపాధ్యక్షులుగా సిద్దం మ హేష్,కార్యదర్శిగా మైదం. రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా చిర్ర రత్నాకర్,ఓబీసీ మోర్చా అధ్య క్షుడిగా కోల గంగాధర్,మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వేముల స్వప్న,కిసాన్ మోర్చా అధ్యక్ష డిగా మూల.మోహన్ రెడ్డి,బీజే వైఎం అధ్యక్షుడిగా దుంపేట వెంకటేష్‌లు ఎంపికయ్యారు. నూతనంగాఎన్నికైన నాయకు లకు పార్టీ శ్రేణులు అభినంద నలు తెలిపారు.

రాజన్నకు రూ.5 లక్షల వెండి కానుక




కుమారుడి పేరిట సమర్పించిన వరంగల్ భక్తులు

వేములవాడ నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వరంగల్‌కు చెందిన భక్తులు వెండి కానుకలు సమర్పించారు,వరంగల్‌కు చెందిన తనుగుల రత్నాకర్–అన్నపూర్ణ దంపతులు తమ కుమారుడు జయంత్ పేరిట సుమారు రెండు కిలోల బరువున్న వెండి గంప, బిందె, ప్లేటును తయారు చేయించి స్వామివారికి కానుకగా అందజేశారు.వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈవో రమాదేవికి భక్తులు వెండి వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

తిప్పాపురం గోశాలను పరిశీలించిన ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్



వేములవాడ, నవంబర్ 4 (వుదయం ప్రతినిధి) : శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపురం గోశాలను ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గోశాలలోని వివిధ షెడ్లను తనిఖీ చేసి, గోవులకు అందిస్తున్న పచ్చిగడ్డి, ఎండుగడ్డి, తాగునీటి వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోవుల ఆరోగ్య పరిస్థితి, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.గోశాల ఆవరణలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోవుల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, వాటికి అవసరమైన ఆహారం, నీరు నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆలయ ఇన్‌చార్జి డీఈ రామ్‌కిషన్ రావు, సీనియర్ అసిస్టెంట్ సంకపెల్లి పవన్, ప్లంబర్ కమలాకర్, గోశాల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా..

- కాళేశ్వరం నీటి పంపిణీ పై లెక్కలు చెప్పండి..
- గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు




పెద్దపల్లి, (సుల్తానాబాద్) నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల,అల్లిపూర్ గ్రామాల్లో బుధవారం రోజున ఐకేపీ & సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన అనంతరం సుల్తానాబాద్ సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను, భూసార పరీక్ష రిపోర్టు పత్రాలను అందజేసిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి లభ్యతకు ఇబ్బంది సహజమని, అయితే కరెంటు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నీటిని సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలకే నీటిని మళ్ళించారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు మాటలు అన్నీ నీటి మూటలని చెప్పారు. ఎక్కడికి వెళితే అక్కడ మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని కాళేశ్వరం నీరు తొలుత ముద్దాడుతాయని చెప్పి ప్రజలను వంచించినారని చెప్పారు. ఇంత నీచమైన మాటలతో రైతులను మోసం చేశాడని హరీష్ రావు పై మండిపడ్డారు. దమ్ముంటే కాళేశ్వరం ద్వారా ఎక్కడికి నీటి సరఫరా చేశారో లెక్కలు చెప్పాలని విజయ రమణారావు డిమాండ్ చేశారు. ఎలినో ప్రభావంతో కరువు ఏర్పడే పరిస్థితి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు ఏర్పడిందని బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన రైతులను, ప్రజలను కోరారు. ప్రపంచమంతా ఏలినో ప్రభావం ఉండగా, అక్కడ కూడా కాంగ్రెస్ వల్లే కరువు ఏర్పడుతుందా మరి అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కరోనా వచ్చిందని, అది బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లనే వచ్చిందా మరి అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు,పలు గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచ్లు మరియు వ్యవసాయ శాఖ ఏవో, శాస్త్రజ్ఞులు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల వివరాలు, పరిపాలనా రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కోశాధికారి కే. రమేష్
- నవంబర్ 7వ తేదీలోగా ప్రతి ఉద్యోగి ఈ-హెచ్ఆర్ఎంఎస్ ఖాతా లో వివరాలు నమోదు చేసుకోవాలి
- డిసెంబర్ 1 నుంచి అన్ని శాఖల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ రికార్డుల నిర్వహణ చేపట్టాలి
- ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్ వినియోగంపై అధికారులకు అవగాహన



పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల వివరాలు, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేయాలని జిల్లా కోశాధికారి కే. రమేష్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం సమీక్షత జిల్లా కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ-హెచ్ఆర్ఎంఎస్ (e-HRMS), ఈ-శాంక్షన్ (e-Sanction) మాడ్యూళ్ల వినియోగంపై జిల్లా కోశాధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి కే. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల పూర్తి వివరాలు, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన రికార్డుల డిజిటలైజేషన్ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అక్టోబర్ 17వ తేదీన మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ అమలుకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జీఓ నంబర్లు 138, 139, 141లను విడుదల చేసిందని పేర్కొన్నారు.ఈ విధానం అమలులో భాగంగా ప్రతి జిల్లాలో జిల్లా ట్రెజరీ అధికారి (DTO), పే అండ్ అకౌంట్స్ అధికారి (PAO) నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్, వామిస్ (WAMIS) మాడ్యూళ్ల వినియోగం, అమలుపై శిక్షణ అందిస్తారని వివరించారు. ప్రభుత్వ శాఖల్లో డిజిటలైజేషన్ ద్వారా పరిపాలనా వ్యవహారాల్లో పారదర్శకత పెరుగుతుందని, ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్యాలయాల్లో పనులు వేగవంతంగా పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ వ్యక్తిగత ఈ-హెచ్ఆర్ఎంఎస్ ఖాతాలో లాగిన్ అయి, అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నమోదు ప్రక్రియను నవంబర్ 7వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలో డిజిటలైజేషన్ ప్రక్రియ అమలును పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ఉద్యోగులందరికీ ఈ విధానంపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ రికార్డుల నిర్వహణ అమల్లో ఉండాలని, ఇందుకు అవసరమైన సన్నాహక చర్యలను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కోశాధికారి సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చతుర్వేద పరీక్షల్లో వేములవాడ వేద విద్యార్థుల ప్రతిభ



ఇద్దరికి రజత పతకాలు.. గురువుకు ఉత్తమ అధ్యాపక సన్మానం

వేములవాడ, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని వేద పాఠశాల విద్యార్థులు చతుర్వేద పరీక్షల్లో ప్రతిభ చాటారు. తెలంగాణ ప్రాంతీయ చతుర్వేద పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జయపత్రికలు అందుకున్నారు.శ్రీ జనార్ధనానంద స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలకు వేద పాఠశాలలో నాలుగు వేదాలను అభ్యసిస్తున్న విద్యార్థులు హాజరయ్యారు. సామవేదం పూర్వభాగం (మూలాంతం) పరీక్షల్లో నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ముసుగోటి షణ్ముఖ శర్మ, కొంజర్ల లక్ష్మీనరసింహ శర్మ ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై రజత పతకాలు సాధించారు. అన్నవరపు సత్యనారాయణ శాస్త్రి, రేవూరి షణ్ముఖ శర్మ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందారు.విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన గురువు బ్రహ్మశ్రీ పాలకోడేటి జయరామ శర్మకు ఉత్తమ అధ్యాపక సన్మానం లభించింది. ఈ సందర్భంగా ఏఈవో నాగుల మహేష్, సీనియర్ అసిస్టెంట్ సూగురు సురేష్ చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు, గురువుకు సన్మానం నిర్వహించారు.వేద విద్యను అభ్యసిస్తూ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆలయ అధికారులు అభినందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో పట్టణాల అభివృద్ధి

- ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు
- పెద్దపల్లి పట్టణంలో పలు వార్డుల్లో రూ. 77 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- రూ. 7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం



పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే పట్టణాల అభివృద్ధి జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విజయ రమణారావు అన్నారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని 5వ వార్డులో రూ. 3.85 కోట్లతో, 9వ వార్డులో 2.45 కోట్లతో, 10వ వార్డులో రూ.3.24 కోట్లతో , 11వ వార్డుల్లో 2.93 కోట్ల యూ.ఐ.డి.ఎఫ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో రూ.62.23 కోట్ల యూ.డి.ఐ.ఎఫ్ నిధులు మంజూరు చేసుకోవడం జరిగిందని వాటితో పెద్దపల్లి పట్టణం సుందరంగా మారుతుందని అన్నారు. పట్టణంలో గత సంవత్సరం టీ.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధుల ద్వారా రూ.35కోట్లు మంజూరు చేసి పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. అలాగే డి.ఏం.ఎఫ్.టి నిధుల ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసుకుని శరవేగంగా పలు వార్డుల్లో అభివృద్ధి చేశామని పెద్దపల్లి పట్టణంలో రూ. 7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని నిధులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని రోడ్ల , డ్రైనేజీల నిర్మాణ విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి అధికారులు ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచనలు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, డబల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్లు , అనేక రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రజలందరూ గమనించాలి అని విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు, అభివృద్ధి పనులు అవసరం ఉన్నా ప్రజా ప్రతినిధులను అధికారులను సంప్రదించాలని వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేరళ అసెంబ్లీలో జాతీయ స్థాయి పీఏసీ సమావేశాలలో తెలంగాణ సీనియర్ ఎమ్మెల్సీ టీ.భాను ప్రసాద్ రావు

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలోని కేరళ శాసనసభ భవనంలో పార్లమెంట్, వివిధ రాష్ట్రాల శాసనసభల పబ్లిక్ అకౌంట్స్ కమిటీల (PAC) చైర్మన్ల అఖిల భారత సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ జాతీయ స్థాయి సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం తరఫున పలువురు ప్రజాప్రతినిధులు, శాసనసభ అధికారులు హాజరయ్యారు. తెలంగాణ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు Telangana Senior ఎమ్మెల్సీ T. భాను ప్రసాద్ రావు, తెలంగాణ శాసనమండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు, తెలంగాణ శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. పార్లమెంటరీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కె.సి. వేణుగోపాల్ సహా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల శాసనసభలకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు, కమిటీల చైర్మన్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో ఆర్థిక జవాబుదారీతనం, ప్రభుత్వ ఖర్చులపై సమర్థవంతమైన ఆడిట్ విధానాలు, ప్రజాధనం సక్రమ వినియోగంపై శాసనసభల పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు.

పట్టణాల నుండి పల్లెటూర్లకు పాకుతున్న గంజాయి స్మగ్లింగ్

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



ఈ రోజు సాయంత్రం సమయంలో రాఘవపూర్ గ్రామ శివారులో గల LMN బిక్స్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతనిని పట్టుకొని విచారించగా అతని వద్ద గంజాయి దొరికింది, దానిని అతను ఇతర రాష్ట్రాల వలస కూలీలకు అమ్ముదామని వచ్చినట్లు తెలపగా అతనిని పోలీసులు విచారించగా అతని పేరు పాకాల లోకేష్ r/o హైదరాబాదు అని తెలుపగా, అతనిని పట్టుకొని అతని వద్ద నుండి ఒక 1kg 161 గ్రాములు గంజాయిని సీజ్ చేసినారు. దాని విలువ సుమారుగా Rs 58050/- గా ఉంటుందని, దీనిపై కేసు నమోదు చేసి పెద్దపల్లి రూరల్ ఎస్సై దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తేలియాల్సి ఉంది.

ఐకేపీ & సింగిల్ విండో కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



ఓదెల మండలం ఉప్పరపల్లి గోపరపల్లి,హరిపురం,పిట్టలఎల్లయ్యపల్లి, కొలనూరు, లంబాడీతండా,నాంసానిపల్లి గ్రామాల్లో ఐకేపీ &సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్, పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బల్వంతపూర్ లో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

మల్యాల మండలం నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతపూర్ గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమము మండల వ్యవసాయ అధికారి కే.చంద్ర దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.రైతులు ఎల్ నినో ప్రభావము ఎక్కువగా ఉండటంవల్ల పంటలను సంరక్షించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ,రైతులు తమ పొలాలలో వరి పంట కోసిన తరువాత పంట కుంటలు వీబీజీ రామ్ పథకం క్రింద ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.వరి పంట తర్వాత పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం,పర్యావరణం కాలుష్యం జరుగుతుంది కావున ప్రతి రైతు పంట అవశేషాలను నేలలో కలియ దున్ని నేల సారం పెంచాలని అలాగే ఎండాకాలం లో పశువుల కొరకు పశుగ్రాసం సాగు చేయాలని యాసంగిలో ఆరుతడి పంటలు అయిన మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు,నూనె గింజ పంటలు అయిన ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ వైపు మల్లాలని రైతులకు సూచించారు.మండల కేంద్రంలో పెసర విత్తనాలు రాయితీలో కలవు. కావలసిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు తో సంప్రదించాలని కోరారు.

ఉద్యానవన శాఖ క్రింద తక్కువ నీటితో, తక్కువ రోజులు పంట అయిన కూరగాయలు పండించి ఆదాయం పొందాలని హెచ్ఈఓ అనిల్ తెలుపడం జరిగింది. మామిడి, ఆయిల్ పామ్ తోటలకు ఎండాకాలంలో డ్రిప్ ద్వారా నీటి తడులు ఇచ్చి కాపాడుకోవాలని తెలపడం జరిగింది. ఆయిల్ పామ్ సాగు చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చని తెలపడం జరిగింది. రైతులు సోలార్ ఫెన్సింగ్ మరియు డ్రిప్ పరికరాల రాయితీ కొరకు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్రీనివాస్, RI రాణి, GPO లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కవిత, Aeo కే శ్రీనివాస్, Ae నీటి పారుదల శ్రీకాంత్, తదితర రైతులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 4 నవంబర్ 2026



మాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో కలెక్టర్ పర్యటించి, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల విస్తీర్ణం, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొంపల్లిలో ఖాకీల మెరుపు దాడి.. పత్రాలు లేని వాహనాలపై ఉక్కుపాదం

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామంలో పోలీసులు ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ ఆధ్వర్యంలో రూరల్, టౌన్ పోలీసు బృందాలు గ్రామాన్ని చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 42 మోటార్ సైకిళ్లు, రెండు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. మొత్తం 44 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో వాహనదారుల్లో కలకలం నెలకొంది. ఈ సందర్భంగా ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ప్రజల భద్రత కోసం పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కార్డన్ సెర్చ్‌లో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్ఐ మధుకర్, టౌన్ ఎస్ఐ రాజశేఖర్, ఎస్ఐ శ్వేత, ఎస్ఐ నరేష్, ధర్మారం ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ రాజు, గ్రామస్తులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్నపేట పాఠశాలకు 50 బెంచీల వితరణ

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి మండలం అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 బెంచీలను వితరణ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వీటిని సమకూర్చారు. విద్యార్థులకు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేదని తెలుసుకుని బెంచీలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ.. తాను పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదువుకున్నానని, బంధంపల్లి నుంచి ఐదు కిలోమీటర్లు నడిచి వచ్చి విద్యాభ్యాసం చేశానని గుర్తుచేసుకున్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. గతంలో పాఠశాలకు ఆర్చ్, గేటు కూడా అందించినట్లు తెలిపారు. బెంచీల వితరణపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎంకే ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా జాదవ్ అంబాజీ

ఆసిఫాబాద్(వుదయం ప్రతినిధి)



జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశాల మేరకు బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. శాఖ అభివృద్ధికి, విద్యార్థులు, లబ్ధిదారుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తానని అంబాజీ తెలిపారు.

విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నంది కమాన్ వద్ద నూతన పటాసుల దుకాణం ప్రారంభం

వేములవాడ, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి) :

వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ పటాసుల దుకాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా దుకాణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు.అనంతరం నిర్వాహకులు ఎర్ర శ్రీనివాస్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమని, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు, పట్టణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో పటాసుల కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అందించాలని నిర్వాహకులకు సూచించారు.పటాసుల విక్రయాలు, నిల్వ విషయంలో సంబంధిత శాఖల నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ స్థానిక కౌన్సిలర్ కాశ శ్రీనివాస్,విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ కుటుంబ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త బుస్స దశరథం, పట్టణ ప్రముఖ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల పరికరాల వితరణ

పెద్దపల్లి, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి)



తమ తల్లిదండ్రులు సత్తమ్మ అంజయ్యల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల విలువైన ఉపకరణాలకు అందజేసేందుకు ముందుకు వచ్చిన కరీంనగర్ ఆర్ కె ఆగ్రోస్ అధినేత మియాపురం నాగరాజు, రామకృష్ణలను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. తల్లిదండ్రుల పేరిట సమాజానికి ఉపయోగపడే సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని ఆయన అన్నారు. బుధవారం నాడు నాగరాజు సోదరులు మంత్రి నివాసంలో ఆయనను కలిసి తమ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కరీంనగర్ జిల్లా కొండయ్య పల్లి గ్రామపంచాయతీకి రూ.1.5 లక్షల విలువైన పారిశుద్ధ్య పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మంథని నియోజకవర్గం ముత్తారం కస్తూర్బా బాలికల వసతి గృహానికి రూ.2 లక్షల విలువైన ఆటోమేటిక్ చపాతీల తయారీ యంత్రాన్ని బహూకరించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ యంత్రం ద్వారా గంటకు 500 చపాతీలను తయారు చేయవచ్చు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ అసిస్టెంట్ డైరెక్టర్ బర్ల రాజు, అడవి శ్రీరాంపూర్ ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతిలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభ్యున్నతి, విద్యాభివృద్ధి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభ్యున్నతి, హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం విద్య, ఉపాధి రంగాలలో కల్పిస్తున్న రిజర్వేషన్లు, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పిల్లలకు సమాజంలో సముచిత స్థానం, గౌరవం కల్పించడంతో పాటు వారి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ, ఆత్మ విశ్వాసం పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి, జిల్లా కో-ఆర్డినేటర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి - అదనపు కలెక్టర్ చంద్రయ్య

దండేపల్లి మండలంలో సుడిగాలి పర్యటన

దండేపల్లి: నవంబర్ 04 (వుదయం విలేఖరి)

దండేపల్లి మండలంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఎల్నినో కారణంగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నదని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడాలని నీటి నిల్వకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సంరక్షణ చర్యలు పెద్ద ఎత్తున చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య కోరారు. విబిజిరాంజీ కింద ఇంకుడు గుంతలు,నీటి తొట్టెలు,నీటి కుంటలు,పంట కుంటలు, వాననీటిని ఒడిసి పట్టే పైకప్పు వర్షపు నీటి సంరక్షణ నిర్మాణం వంటి నీటిని నిల్వ చేసే పనులకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలతో పనులు చేయించాలని వివిధ గ్రామాల సర్పంచ్ లకు ఆయన సూచించారు. బుధవారం దండేపల్లి మండలం లోని వివిధ గ్రామాల్లో పర్యటించారు

రెబ్బనపల్లి గ్రామంలో విబిజిరాంజీ కింద నిర్మాణంలో ఉన్న వ్యవసాయ కుంటను రెండు కిలో మీటర్ల దూరం బైక్ మీద ప్రయాణించి ఆ తర్వాత కాలిబాటన గుట్టలు ఎక్కి, పొలాల్లోకి పోయి,మండుటెండలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 50 మంది ఉపాధిహామీ కూలీలతో ఆయన ముచ్చటించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.మీకు వీబీజీరాంజీ కింద కూలి పైసలు ఎప్పటికప్పుడు పడుతున్నాయా? మీలో అర్హులు చేయూత పెన్షన్ కు దరఖాస్తు పెట్టుకున్నారా? మీ గ్రామంలో తాగునీరు సక్రమంగా వస్తున్నదా? మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ వారిని ఆరా తీశారు.ఆ తరువాత లింగాపూర్ మరియు మాకూల్ పేట్ గ్రామాల పరిధిలోని అటవీ భూములలోకి వెళ్లి వీబీజీరాంజీ కింద చేస్తున్న ఖండిత కందకాలు వంటి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.అక్కడ లింగాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 200 మంది కూలీలతో ఆయన ముచ్చటించారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తమ గ్రామంలో మిషన్ భగీరథ కింద తాగునీరు సక్రమంగా రావడం లేదని వారు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన అప్పటికప్పుడు ఫోన్ ద్వారా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫోన్ చేసి బుధవారం సాయంత్రం కల్లా నీటికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కరించి గ్రామంలో అందరికీ నీళ్లు వచ్చే విధంగా చేయాలని తక్షణ ఆదేశాలు జారీ చేశారు.



ఆ తర్వాత దండేపల్లి మండలం ప్రజా పరిషత్తు కార్యాలయానికి వచ్చి వచ్చి అక్కడ జరుగుతున్న మెట్ ల శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వీబీజీరాంజీ కింద ఉన్నటువంటి వివిధ రకాల పనులను ఉపయోగించుకోవాలని, గ్రామాలలో పెద్ద ఎత్తున నీటి సంరక్షణ పనులు చేపట్టాలని,ప్రతి గ్రామంలో కనీసం 50 నుండి 60 మందికి తగ్గకుండా కూలీలు ప్రతిరోజు ఉపాధి హామీ పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఆ సమావేశంలో ఉన్నటువంటి ఫీల్డ్ అసిటెంట్లు మరియు మేట్స్ ను ఉద్దేశించి ప్రతిరోజు క్రమం తప్పకుండా వారు ఉదయాన్నే ఆరు గంటలకల్లా ఫీల్డ్ మీదకు పోయి ఉదయం పూట అటెండెన్స్ ఆన్లైన్ లో క్యాప్చర్ చేసి పనిని కొలతలకు తగ్గట్టుగా చేయించి ఆ తర్వాత నాలుగు గంటల వ్యవధి కాగానే రెండోసారి కూడా అటెండెన్స్ ఆన్లైన్లో వేయించాలని వారికి సూచించారు.మేట్లకు ప్రత్యేకంగా రోజుకు రూ 300 వరకు కూలి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాబట్టి వారు మరింత శ్రద్ధతో వీబీజీరాంజీ పనుల పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. మండలంలో ప్రతి గ్రామ పంచాయతీలో కూడా కచ్చితంగా విభజిరాంజి పనులు పెద్ద ఎత్తున కొనసాగాలని ఆయన కోరారు.అంతకుముందు అదనపు కలెక్టర్ బుధవారం ఉదయాన్నే 9.30 గంటలకు గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పుష్కర్ ఘాటుకు వచ్చి అక్కడ పుష్కర్ ఘాటు పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు.ఇరిగేషన్, మిషన్ భగీరథ మరియు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లతో ఆయన సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం ఆయన గూడెంలోని జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు.ఆ పిమ్మట రెబ్బనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్నటువంటి యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు.అక్కడ ఇంజనీర్లు కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పనుల పురోగతి నత్త నడకన నడుస్తున్నదని వేగం పెంచాలని ఆదేశించారు.ఆ తరువాత వెల్గనూరు గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించబడినటువంటి ఇంకుడు గుంతలను పరిశీలించారు.అనంతరం ద్వారక గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో ముచ్చటించి తరగతి గదులు కలయ తిరుగుతూ అక్కడి సిబ్బంది ఏ విధంగా పాటలు బోధిస్తున్నారు? అక్కడ ఏమేం సమస్యలు ఉన్నాయి? అనేవి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు హాజరు శాతము,సిబ్బంది హాజరు పట్టికను కూడా పరిశీలించారు.ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలలో ప్రైవేటు పాఠశాలల కంటే అధిక స్థాయిలో ఇప్పుడు సౌకర్యాలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని అక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయులకు సూచించారు.ఆ వెంటనే ద్వారక గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించబడినటువంటి మ్యాజిక్ ఇంకుడు గుంతలు,కమ్యూనిటీ మరియు వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలను తనిఖీ చేశారు.నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనం తదితర పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.ఆయన వెంట ఎంపీడీవో జేఆర్ ప్రసాద్,మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్ తదితర మండల స్థాయి అధికారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యస్జిఎఫ్ బాడ్మింటన్ పోటీలకు రెబ్బనపల్లి పాఠశాల విద్యార్థి ఎంపిక

దండేపల్లి: నవంబర్ 04 (వుదయం విలేఖరి)



గత నెల మంచిర్యాల హైటెక్ సిటీ క్లబ్లో జరిగిన ఏస్.జి.ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్ 14 ఇయర్స్ బాలుర బాడ్మింటన్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ లో దండేపల్లి మండలం రెబ్బనపల్లి ఉన్నత పాఠశాల లో 7 వ తరగతి చదువుతున్న జె . రాంచరణ్ మంచిర్యాల జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి అంత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యాడు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్ 14 ఇయర్స్ బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటాడని పాఠశాల పి.డి గాజుల శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంచార్జ్ మండల విద్యాధికారి మంత్రి రాజు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రూప చారి, ఉ పాధ్యాయ బృందం, జిల్లా ఎస్.జి.ఎఫ్ సెక్రెటరీ ఎండి యాకూబ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బండి రవి,సూర సుదర్శన్ , సీనియర్ పీడీలు రామ్మోహన్రావు సిరంగి గోపాల్,రెబ్బనపల్లి గ్రామ సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్,ఉపసర్పంచ్ ఊరటి వినోద్,గ్రామస్థులు,పెద్దలు అభినందించారు.

వరి దిగుబడి అంచనాకు పంట కోత ప్రయోగం

నాగిరెడ్డిపేట,వుదయం



నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంట తండాలో జాతీయ గణాంక సంస్థ ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు దేవసోత్ రమేష్ పొలంలోని సర్వే నంబర్ 225లో 5×5 మీటర్ల ప్లాట్ను ఎంపిక చేసి దిగుబడిని అంచనా వేశారు. పంటల దిగుబడి వివరాల సేకరణకు ఈ ప్రయోగాలు కీలకమని వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో జాతీయ గణాంక సంస్థ కన్సల్టెంట్ జీవరత్నం, సర్పంచ్ బాల్య నాయక్, ఉప సర్పంచ్ రామావత్ వాసురం, జీపీఓ రాజు, ఏఈఓ రజిత, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హెర్బల్ ధూప్ స్టిక్స్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు



జన్నారం,నవంబర్ 4 (వుదయం విలేఖరి)

ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా,యాక్సెంచర్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెర్బల్ ధూప్ స్టిక్స్ తయారీ శిక్షణను పూర్తి చేసిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిక్షకురాలు జొన్నలక్ష్మి , డీఆర్డీఏ–ఐకేపీ ఏపీఎం లలిత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఏపీఎం లలిత మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన మహిళలు తమ నైపుణ్యాలను ఉపయోగించుకొని సొంత వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. హెర్బల్ ధూప్ స్టిక్స్, అగరబత్తులు, ఆవు పేడ ప్రమిదలు తదితర ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్లో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయాలకు ఐకేపీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని, మార్కెట్లో ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు మద్దతు కల్పిస్తామని తెలిపారు.శిక్షణ పొందిన ప్రతి మహిళ విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈడీఐఐ ప్రాజెక్ట్ ఆఫీసర్ బుక్యా దేవేందర్ నాయక్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, వీవోఏలు ముల్కాల రవీందర్, రాథోడ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యమే ఉపాధికి బాట.. ఉచిత శిక్షణను అందిపుచ్చుకోవాలి

మున్సిపల్ చైర్పర్సన్ అనూష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 4 :



మైనార్టీ మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాలను అందిపుచ్చుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ సూచించారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న విద్యను ఉపాధి మార్గంగా మలుచుకుని తమ కాళ్లపై తాము నిలబడాలని ఆకాంక్షించారు. మహిళలు ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని ప్రతిభను వెలికితీసి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఆదిలాబాద్ మైనార్టీస్ కామన్ సర్వీస్ సెంటర్లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెహందీ డిజైనింగ్, మగ్గం వర్క్, టైలరింగ్ ఉచిత శిక్షణ కార్యక్రమాలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా కోర్సుల్లో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలు స్వయంగా ఉపాధి పొందవచ్చని తెలిపారు. భవిష్యత్తులో చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. శిక్షణను ప్రతి ఒక్కరూ శ్రద్ధగా నేర్చుకుని, పొందిన నైపుణ్యాలను తమ జీవితాల్లో ఉపయోగించుకోవాలని కోరారు. మహిళల అభ్యున్నతి, సాధికారత, స్వయం ఉపాధి కోసం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ కలీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యువతి దీక్ష

ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరణ

దండేపల్లి: నవంబర్ 04 (వుదయం విలేఖరి)



మండలంలోని లింగాపూర్ కు చెందిన అక్షర,అదే గ్రామ సర్పంచ్ కుమారుడు మహేందర్ ప్రేమించుకున్నారు.పెళ్లి చేసుకుందాం అని అడుగుతే నిరాకరించి మహేందర్ పట్టించుకోలేదని దీంతో యువతి ఆదివారం రాత్రి నుంచి ప్రియుడి ఇంటి ఎదుట నిరాహార దీక్షకు దిగిన విషయం తెలిసిందే.. కాగా యువతి తన దీక్షను నాలుగో రోజు బుధవారం కొనసాగించింది.ఈ సమయంలో మహేందర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని వెళ్లినప్పటికీ,యువతి మాత్రం ప్రియుడి ఇంటి ఎదుటే కూర్చుని దీక్షను కొనసాగిస్తుంది. గ్రామ పెద్దలు పంచాయతీ నిర్వహించినా మహేందర్ అక్షర తో పెళ్లికి ససేమిరా అన్నాడని సమాచారం ఇప్పటికైనా యువతి ఆరోగ్యం క్షీణించకముందే అధికారులు,పాలకులు పట్టించుకొని యువతికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



కరువును ఎదుర్కొనేందుకు ఇందారం సమష్టి సంకల్పం!

- **నీరు, విద్యుత్ పొదుపుపై గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం**
- **సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్**

జైపూర్ (వుదయం విలేకరి)

జైపూర్ మండలం ఇందారం గ్రామపంచాయతీ పరిధిలో కరువు ప్రభావం, ముందస్తు ఉపశమన చర్యలపై బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్ మాట్లాడుతూ కరువును ఎదుర్కోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, నీరు, విద్యుత్ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. బోరుబావులు, మోటార్లను క్రమపద్ధతిలో వినియోగించుకోవాలని, రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. పశువులకు పశుగ్రాసం, తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామస్తుల సహకారంతో ఇందారాన్ని కరువు ప్రభావం నుంచి కాపాడుకుందామని పిలుపునిచ్చారు.



ఓటు హక్కుపై యువతలో చైతన్యం నింపాలి

చైర్పర్సన్ బండారి అనూష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 4 :

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు దానిని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో ఓటు హక్కు ప్రాధాన్యంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, సామాజిక బాధ్యతతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత నాయకత్వ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవడంతో పాటు, ఇతరులకు కూడా దాని ప్రాధాన్యాన్ని వివరించాలని అన్నారు. విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అనూష సతీష్ పేర్కొన్నారు.

ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి

జిల్లా ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, బుధవారం రోజు చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని,కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ,అసాంఘిక కార్యకలాపాలు,గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గ్రామస్థాయిలో పోలీసులపై ప్రజలకు నమ్మకం,విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని,విజిబుల్ పోలీసింగ్ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో కౌటాల సిఐ సంతోష్,ఎస్సై కమలాకర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత సహాయం పొందండి

టేకుమట్ల పారా లీగల్ వాలంటీర్ అంబాల రమేష్

భూపాలపల్లి నవంబర్ 4 వుదయం ప్రతినిధి



న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టేకుమట్ల పారాలీగల్ వాలంటీర్ అంబాల రమేష్ అన్నారు.ఈ సందర్భంగా నవంబర్ 9 తేది న నేషనల్ లీగల్ సర్వీసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వెలిశాల గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలకు,అణగారిన వర్గాల వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి, 3లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి ఉచిత న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశ్యం అని అన్నారు. వివిధ కేసుల్లో ఉన్న వ్యక్తులు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకుని, వారి విలువైన సమయాన్ని ఆదా చేసుకుని,సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ఉచిత న్యాయం సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100 లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త వేరు చేస్తేనే గ్రామం పరిశుభ్రం!



ఘన వ్యర్థాల నిర్వహణపై కొత్తూరులో ఇంటింటా అవగాహన సదస్సు

రాయపర్తి, నవంబర్ 4 (వుదయం ప్రతినిధి) :

గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెత్తను ఇష్టానుసారంగా పడేయకుండా తడి, పొడి, ప్రమాదకర, సానిటరీ వ్యర్థాలుగా వేరు చేసి అందించాలని గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ సూచించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు (SWM–2026) ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో బుధవారం ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని 8వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు చెత్త సేకరణ, వర్గీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కందికట్ల స్వప్న సంతోష్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి నుంచి వెలువడే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన లేదా ప్రమాదకర వ్యర్థాలు, సానిటరీ వ్యర్థాలను కలపకుండా విడివిడిగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు.చెత్తను సరైన పద్ధతిలో వేరు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడంతోపాటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కొత్తూరు గ్రామాన్ని పరిశుభ్రతలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఇంటి నుంచి చెత్త వర్గీకరణ ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ ఆస్మా, వార్డు సభ్యుడు నేలవెల్లి సుబ్బారావు, కారోబార్ కందికట్ల సురేష్, పంచాయతీ సిబ్బంది తాటికాయల బాబు, తాటికాయల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్ అడవుల్లో మచ్చల అటవీ గుడ్లగూబ

కెమెరాలో బంధించిన వన్యప్రాణి పరిశోధకుడు డా.వెంకట్ అనగంధుల

జన్నారం, నవంబర్ 4 (వుదయం విలేఖరి)



కవ్వాల్ టైగర్ రిజర్వ్, జన్నారం డివిజన్ పరిధిలోని ఇంధన్పల్లి రేంజ్లో వన్యప్రాణి పరిశోధకుడు డా.వెంకట్ అనగంధుల మచ్చల అటవీ గుడ్లగూబను చిత్రీకరించారు.దీని శాస్త్రీయ నామం స్ట్రిక్స్ ఒసెల్లాటా (Strix ocellata). ఇది భారత ఉపఖండానికి చెందిన ప్రత్యేకమైన రాత్రిచర వేట పక్షి. గుడ్లగూబల కుటుంబమైన స్ట్రిజిడేకు చెందుతుంది. శరీరంపై గోధుమ, తెలుపు రంగుల మచ్చలు, పెద్ద గుండ్రని ముఖం, లోతైన నల్లని కళ్ళు దీని ప్రత్యేక లక్షణాలు.ప్రధానంగా పొడి ఆకురాల్చే అడవులు, మిశ్రమ అటవీ ప్రాంతాలు, పొదలతో కూడిన అడవులు, చెట్లతో నిండిన వ్యవసాయ భూములు, గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తుంది. పెద్ద వృక్షాలు, సహజమైన చెట్ల తొర్రలు, దట్టమైన కొమ్మలు ఉన్న ప్రాంతాలను విశ్రాంతి, గూడు నిర్మాణానికి ఎంచుకుంటుంది. ఎలుకలు, చిన్న క్షీరదాలు, చిన్న పక్షులు, బల్లులు, చిన్న సరీసృపాలు, కప్పలు, పెద్ద కీటకాలు దీని ఆహారం. ఎలుకలను తినడం ద్వారా పంట నష్టాన్ని సహజంగా తగ్గిస్తుంది.ఎలుకల జనాభాను సహజంగా నియంత్రించి పంట నష్టాన్ని తగ్గిస్తుంది. ఆహార గొలుసు, ఆహార వలయ సమతుల్యతను కాపాడుతుంది. దీని ఉనికి అటవీ ఆవాసాల నాణ్యతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.పెద్ద చెట్ల తొర్రలు, సహజ గుహలను గూడుగా వాడుతుంది. ఆడ పక్షి గుడ్లు పెట్టి పొదుగుతుంది. పిల్లలు పెరిగే వరకు తల్లిదండ్రులు ఆహారం అందించి సంరక్షిస్తాయి. ఐయూసీఎన్ రెడ్ లిస్ట్ ప్రకారం లీస్ట్ కన్సర్న్ విభాగంలో ఉంది. అయినా అడవుల నరికివేత, పెద్ద వృక్షాల తొలగింపు, ఆవాసాల విభజన, వ్యవసాయ రసాయనాల ప్రభావం వల్ల స్థానికంగా ముప్పు ఉంది.మచ్చల అటవీ గుడ్లగూబ కేవలం రాత్రిచర వేట పక్షి మాత్రమే కాదు, అటవీ, వ్యవసాయ పర్యావరణ వ్యవస్థల్లో ఎలుకల నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల పెద్ద పాత చెట్లను, సహజ అటవీ ఆవాసాలను సంరక్షించడం అవసరమని వెంకట్ పేర్కొన్నారు.

సాగు నీరు అందించాలని రైతుల రాస్తారోకో



జన్నారం, నవంబర్ 4 (వుదయం విలేఖరి)

చివరి దశలో ఉన్న వరి పంటకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతగూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.మాజీ ఎంపీపీ సుతారి వినయ్ మాట్లాడుతూ ఈ నెల 7 నుండి కడెం ప్రాజెక్టు నుండి సాగునీరు నిలిపివేస్తామని అధికారులు ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "పంట చేతికొచ్చే సమయంలో నీరు ఆపితే మా బతుకులు ఏం కావాలి..? లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట కళ్లముందే ఎండిపోతుంటే చూస్తూ ఊరుకుంటామా..?" అంటూ ప్రశ్నించారు. కడెం నీరు లేకపోతే పంట పూర్తిగా ఎండిపోయి అప్పులపాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే నిర్ణయం మార్చుకొని చివరి తడి వరకు సాగునీరు కొనసాగించాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉదయ్ కిరణ్ అక్కడికి వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

జయశంకర్ భూపాలపల్లి: నవంబర్ 04(వుదయం జిల్లా ప్రతినిధి)

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బుధవారం మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని రికార్డులను, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని, సీసీ కెమెరాల పనితీరును, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పి సూర్యనారాయణ, సీఐ, వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం. సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.